ప్రజాశక్తి

సోమవారం 14 ఏప్రిల్ 2025   8 పేజీలు

గుంటూరు   పల్నాడు

తాడికొండకు సిఎం వరాలు ఇచ్చేనా?

రాజధాని నియోజకవర్గమే అయినా సమస్యలు అధికమే

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తాడికొండ మండలం పొన్నెకల్లుకు వస్తున్న సిఎం చంద్రబాబు ఈ ప్రాంతానికి ఏమైనా హామీలిస్తారేమోననే ఆసకిసీ ప్రాంత వాసుల్లో నెలకొంది. తాడికొండ మండలంలోని పలు గ్రామాలకు తాగునీటి సమస్యలున్నాయి. తాడికొండ గ్రామంలోనే ఇప్పటికి వారానికి ఒక రోజు నీటి సరఫరా అవుతోంది. గుంటూరు రాజధానికి నాలుగు లైన్ల రహదారి నిర్మాణం, విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోంది. గుంటూరు-బౌద్ధారామం అమరావతి రహదారి విస్తరణ, అమరావతి-తుళ్లూరుకు నాలుగు లైన్ల రహదారి, గుంటూరు-గరికపాడు, పొన్నేకల్లు రహదారి అభివృద్ధి, తాడికొండ-కంతేరుకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణం చేపట్టడం ద్వారా రాజధానికి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. రాజధాని ప్రాంతంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇందుకు 30 వేల

▶ 2లో

సిఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ భార్గవ్‌తేజ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

నేడు పొన్నెకల్లుకు సిఎం చంద్రబాబు

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు హాజరు
- బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో భేటి
- టిడిపి కార్యకర్తలతోనూ ముఖాముఖి
- ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పర్యటన

2లో

లైంగిక వేధింపులతో యువతి ఆత్మహత్య

పోలీసుల తీరును తప్పుబడుతూ కుటుంబీకుల ఆందోళన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మృతురాలు సిఫోర (ఫైల్)

లైంగిక వేధింపులు, ఫొటోలతో బెదించడంతో ఈ మనస్థాపానికి గురైన యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నరసరావుపేట మండలం పమిడిమర్రులో వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మురికిపూడి సిఫోర (23)కు, అదే గ్రామానికి చెందిన రాజేష్‌తో ఏడేళ్ల కిందట వివాహం కాగా వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కొద్దికాలంగా ఆమెను అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నాగరాజు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో మృతురాలి ఇంటిపక్కనే ఉండే మరో మహిళ సిఫోరను రహస్యంగా ఫొటోలు, వీడియోలు తీసి వాటిని ఆటో డ్రైవర్ నాగరాజుకు ఇవ్వడంతో వాటి ఆధారంగా నాగరాజు లైంగిక వేధింపులకు, బెదిరింపులకు

▶ 2లో

విరిగిపడిన స్తంభం, తెగిన తీగలు

తెనాలిలో వడగండ్ల వాన బీభత్సం

విరిగిపడిన చెట్లు, సెల్ టవర్, విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో ఆదివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వాన, గాలులు బీభత్సం సృష్టించాయి. వేసవి తీవ్రత పెరిగిన సమయంలో వర్షం ఒకింత వాతావరణాన్ని చల్లబరిచింది. దీనికి తోడు వడగండ్లు పడడంతో పిల్లలు, పెద్దలు సందడి చేశారు. అయితే వానతోపాటు గాలి ఉధృతకి స్థానిక జగ్గడిగుంటపాలెంలోని టిడ్కో గహ సముదాయం వద్ద ఓ సెల్

▶ 2లో

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో వివిధ రకాల స్వయం ఉపాధి పథకాలకు రుణాల మంజూరుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదేళ్లలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎలాంటి లబ్ధి పొందని వారు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారు http://apobmms.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సోమవారం నుండి వచ్చేనెల 10వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలో 990 మందికి వివిధ రకాల రుణాలు అందచేస్తామని తెలిపారు. 21 నుండి 50 ఏళ్లున్నవారు, తెల్లరేషన్ కార్డు, ఆధార్, మీ-సేవ కుల ధ్రువీకరణపత్రం ఉన్నవారు అర్హులని, ఆటో/కారు రుణాలు పొందాలనుకుంటే లైసెన్స్ కలిగి ఉండాలని, ఒక కుటుంబం నుండి ఒకరు మాత్రమే సబ్సిడీ రుణం పొందవచ్చని తెలిపారు. మండలం, మున్సిపాలిటీ, స్క్రీనింగ్ కమిటీల ద్వారా అధికారులు, బ్యాంకు మేనేజర్లు మాత్రమే సభ్యులుగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శిథిలావస్థలో లెదర్ పార్కులు

కొరియా బృందం పర్యటనతో కొత్త ఆశలు - ఈసారైనా చర్మకారుల జీవితాలు మలుపు తిరిగేనా?

అడిగొప్పల వద్ద మూతబడిన మిని లెదర్‌పార్కు, నిరూపయోగంగా పడియున్న యంత్రాలు (ఇన్‌సెట్)

ప్రజాశక్తి - మాచర్ల

కాలంతో పాటు పోటీపడలేక, నమ్ముకున్న వృత్తిని వదులుకోలేక చర్మకారులు అర్ధాకలితో అలమటిస్తున్నారు. ఈ వృత్తిపై ఆధారపడి బతుకుతున్నవారు మాచర్ల, గురజాల, వినుకొండ నియోజకవర్గాల్లో సుమారు 10 వేల మంది ఉంటారని అంచనా. వీరి జీవితాలను 'మలుపు' తిప్పాలని, వారి కుటుంబాల్లో వెలుగులు నింపాలని రెండు దశాబ్దాల కిందట ప్రభుత్వం ఏర్పాటు చేసిన మలుపు కేంద్రాలు (లెదర్ పార్కు, శిక్షణ కేంద్రాలు) మూతబడ్డాయి. శిక్షణ పొందిన వందలాది మందికి ఉపాధీ దక్కలేదు. ప్రస్తుతం లెదర్ పరిశ్రమలు పెట్టడానికి కొరియా దేశానికి చెందిన ఒక బృందం ఈ ప్రాంతంలో పర్యటించటంతో ఈ సారైనా తమ జీవితాలు మలుపు తిరుగుతాయేమోనని చర్మకారులు ఎదురుచూస్తున్నారు.

శిథిలస్థితిలో మాచర్ల, అడిగొప్పల మినీ లెదర్ పార్కులు

మాచర్ల పట్టణంలో మలుపు శిక్షణ కేంద్రం, 30 ఎకరాల్లో దుర్గి మండలం అడిగొప్పల గ్రామ సమీపాన మినీలెదర్ పార్కు నిర్మాణానికి రూ.కోటిని సిఎం చంద్రబాబు 2003లో మంజూరు చేయగా

▶ 2లో

తాడికొండకు సిఎం వరాలు ఇచ్చేనా?

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాలు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో 30 వేల ఎకరాల భూమిని ప్రభుత్వం భూ సమీకరణ ద్వారానే ఈ భూములు తీసుకుంటుందనే ప్రచారమవుతోంది. తుళ్లూరు మండలంలోని వడ్డమాను, పెదపరిమి, హరిశ్చంద్రపురం గ్రామాలతో పాటు పక్కనే ఉన్న తాడికొండ, మేడికొండూరు, అమరావతి మండలాలకు చెందిన గ్రామాల్లో 30 వేల ఎకరాలకు వరకు సేకరిస్తారనే ప్రచారం ఉంది. అయితే భూ సమీకరణ ప్రక్రియలో తీవ్ర జాప్యమవుతున్నందున తమకు 2013 భూ సమీకరణ చట్టం ద్వారా భూసేకరణ చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. రాజధానికి చుట్టూ నిర్మించే అవుటర్ రింగ్ రోడ్డు, పశ్చిమ బైపాస్, ఇంటర్నల్ బైపాస్ తదితర ప్రాజెక్టులకు భూములు తీసుకుంటారనే ప్రచారంతో రైతులు కంగారుపడుతున్నారు.

మరోవైపుఈ ప్రాజెక్టుల వల్ల భూముల విలువ పెరుగుతుందని ఇప్పటికీ గుంటూరు రూరల్, తాడికొండ, అమరావతి, క్రోసూరు, సత్తెనపల్లి తదితర మండలాల భూముల క్రయ విక్రయాలు ఊపందుకున్నాయి. తాడికొండ మండలంలో ఎకరం రూ.3 కోట్ల వరకు పలుకుతోంది. ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో క్రయ విక్రయాలు కూడా తగ్గాయి. దీంతో రియల్టర్లు, మధ్యవర్తులు రాజధానికి దూరంగా ఉన్న మండలాలపై దృష్టి కొనుగోలు దారులు దృష్టి సారించారు. రాజధాని అభివృద్ధిలో భాగంగా వెలగపూడి విజయవాడ రోడ్డు నాలుగు లైన్లగా విస్తరించడం ద్వారా ఉండవల్లి, పెనుమాక, కృష్ణాయపాలెంలో నిత్యం ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం దృష్టి సారించాల్సి ఉంది. జిల్లా కేంద్రం గుంటూరు, రాజధాని ప్రాంతంలో పేరెన్నికగన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతంలో వైద్య సదుపాయాలు మరింత మెరుగుపడతాయని చెబుతున్నారు. 20 వేల జనాభా కల్గిన తాడికొండలో 100 పడకల ఆస్పత్రి నిర్మించాల్సిన అవసరం ఉంది. తాడికొండలో ప్రభుత్వ, ప్రైవేటు పరంగా ఆస్పత్రులు లేవు. నియోజకవర్గంలో విద్యా వైద్య సదుపాయాలతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధికి కృషి జరగాల్సి ఉంది.

లైంగిక వేధింపులతో యువతి ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

దిగాడు. వాటిని సోషల్ మీడియాలోసైతం పెట్టడంతో ఈ విషయాన్ని మృతురాలు తన ఇంట్లో చెప్పడంతోపాటు ఈనెల 5వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే చర్యలు తీసుకోవడంలో పోలీసులు జాప్యం చేశారని మృతురాలి కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన సిఫోర ఈనెల 8న ఎలుకల మందు తినగా 12న తీవ్ర అనారోగ్యానికి గురైంది. ఇదేమీ తెలియని కుటుంబీకులు ఆమెను స్థానిక వైద్యుని వద్దకు తీసుకెళ్లగా ఆమె ఎలుకల మందు తిన్నట్లు తెలిసింది. దీంతో వెంటనే నరసరావుపేటలోని ఆస్పత్రికి ఈసుకెళ్లగా మధ్యాహ్నం మృతి చెందింది. దీంతో ఆగ్రహానికి గురైన ఆమె కుటుంబీకులు, బంధువులు హాస్పిటల్ వద్ద ఆందోళనకు దిగారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు ముందస్తుగా చర్యలు తీసుకుని ఉంటే ఘటన చోటుచేసుకునేది కాదని మృతురాలి కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై స్పందించిన నిందితుడు నాగరాజు, మరో మహిళపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మహిళ పోలీసుల అదుపులో ఉండగా ఆటో డ్రైవర్ నాగరాజు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

తెనాలిలో వడగండ్ల వాన బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

టవర్ కూలిపోయింది. అదే ప్రాంతంలో చెట్లు విరిగిపడ్డాయి. పట్టణంలో మరికొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడి తీగలు తెగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. హుటాహుటిన స్పందించిన విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టి పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.

జగ్గడిగుంటపాలెం టిడ్కో హౌసెస్ వద్ద కూలిన సెల్ టవర్

నేడు పొన్నెకల్లుకు సిఎం చంద్రబాబు

- డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు హాజరు
- బంగారు కుటుంబాలు, మార్గదర్శులతో భేటి
- టిడిపి కార్యకర్తలతోనూ ముఖాముఖి
- ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పర్యటన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో సోమవారం జరిగే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో సిఎం చంద్రబాబు పాల్గొననున్న దృష్ట్యా ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10.40 గంటలకు సిఎం ఉండవల్లి నుంచి పొన్నెకల్లుకు హెలికాప్టర్‌లో వస్తారు. 11 గంటల వరకు ప్రజా ప్రతినిధులను కలుస్తారు. 11.05 గంటలకు పొన్నెకల్లు అంబేద్కర్ కాలనీలో బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి ఆ తరువాత స్థానికులతో సమావేశం అవుతారు. పొన్నెకల్లు ఎంపిపి పాఠశాల వద్ద సోషల్ వెల్ఫేర్ వసతి గృహాలకు శంకుస్థాపన అనంతరం బహిరంగ సభలో పాల్గొం టారు. ప్రభుత్వ స్టాల్స్, ఫొటో ఎగ్జిబీషన్‌ను తిలకిస్తారు. అంబేద్కర్ విద్యానిధి పథకం లబ్ధిదారులతో సమావేశం అవుతారు. పి-4 అమలులో భాగంగా మార్గదర్శులు, బంగారు కుటుంబాలతో ముఖాముఖిగా మాట్లాడి సన్మానిస్తారు. మధ్యాహ్నం 2.05 నుంచి 2.30 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. 2.40 నుంచి 4.10 గంటల వరకు టిడిపి కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తారు. తరువాత ఉండవల్లికి బయలుదేరి వెళాతారని సిఎం కార్యాలయం విడుదల చేసన షెడ్యూలులో వెల్లడించారు. సిఎం పర్యటన ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, ఎస్‌పి సతీష్ కుమార్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, గుంటూరు ఆర్డీవో శ్రీనివాసరావు పరిశీలించారు. డా.బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహాన్ని, సభా ప్రాంగణాన్ని, హెలిప్యాడ్‌ను పరిశీలించారు.

(మొదటి పేజీ తరువాయి)

అప్పటి మంత్రి కోడెల శివప్రసాద్ శంఖస్థాపనతో పనులు మొదలయ్యాయి. 2004లో అధికారంలోకి వచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వాటి నిర్మాణాలను పూర్తిచేసి ప్రారంభించారు. చెప్పులు, బూట్లు తయారీకోసం రూ.25 లక్షలతో ఆధునాతన యంత్రసామగ్రిని తెప్పించి యువతకు శిక్షణ తరగతులను మొదలు పెట్టారు. కొందరికి మద్రాస్‌లో శిక్షణ ఇప్పించి ఇక్కడ మాస్టర్ ట్రైనర్లుగా ఉద్యోగాలు కల్పించి శిక్షణిప్పించారు. మాచర్ల, దుర్గి, వెల్దుర్తి, కారంపూడి, గురజాల, దాచేపల్లి, బొల్లాపల్లి, ఈపూరు మండలాలలకు చెందిన మూడువందల మంది వరకు శిక్షణ పొందారు. శిక్షణ పొందిన యువతకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణం మంజూరు చేసేవారు. తయారు చేసిన చెప్పులు, బూట్లు వారే మార్కెట్లో అమ్ముకునే సౌకర్యం కూడా ప్రభుత్వం కల్పించింది. సత్ఫలితాలు ఇస్తున్న తరుణంలో ఆరు నెలలకే మినీ లెదర్‌పార్కులను పాలకులు మూసేశారు. అందులోని ఖరీదైన యంత్ర సామగ్రి తరలిపోయింది. ఉన్న పరికాలు తుప్పుపట్టాయి. ప్రస్తుతం ముళ్ల పొదల మధ్య శిథిల స్థితిలో ఉన్నాయి. భూములు అన్యాక్రాంతం అయ్యాయి. 21 ఏళ్ళగా మలుపు కేంద్రాలు తెరుచుకోకపోవటంతో యువతకు ఉపాధి లేకుండా పోయింది. ఎప్పటి లాగానే చర్మకారులు రోడ్ల వెంబటి చెప్పులు కుట్టుకుంటూ అస్తుబిస్తుగా బతుకులీడుస్తున్నారు.

శిథిలావస్థలో లెదర్ పార్కులు

కొరియా బృందం పర్యటన

లెదర్ పరిశ్రమ ఏర్పాటు కోసం కొరియా దేశానికి చెందిన బృందం మాచర్ల మండలంలో ఇటివల పర్యటించింది. రాయవరం గ్రామంలో సర్వే నంబర్ 795/3 లోని 151 ఎకరాలు, కొత్తపల్లి గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 67/5లోని 450 ఎకరాల భూములను పరిశీలించారు. రేబాక్, పూమా, నైక్ వంటి ప్రపంచ దిగ్గజ పరిశ్రమల ఏర్పాటుకు ఈ స్థల పరిశీలన జరిగింది. త్వరలో కొరియా దేశస్తులు మాచర్ల మండలంలో లెదర్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారని వార్తలు రావటంతో ఈ ప్రాంతంలోని చర్మకారులు తమ జీవితాల్లో మార్పు వస్తుందని, మెరుగైన జీవన పరిస్థితులు వస్తాయని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

మూత పడ్డ మలుపు కేంద్రాలను తెరవాలి

మూత పడ్డ మలుపు కేంద్రాలను వెంటనే తెరవాలని చర్మకారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ప్రాంతంలో లెదర్ పరిశ్రమలు ఏర్పాటు చేసే నాటికి మలుపు కేంద్రాల ద్వారా యువతకు చెప్పులు, బూట్లు తయారీలో శిక్షణ ఇచ్చి సిద్ధం చేయాలని కోరుతున్నారు. శిక్షణ పొందిన వర్కర్లు సిద్ధంగా ఉంటే వెంటనే లెదర్ పరిశ్రమల్లో ఉద్యోగాలు వస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. భవనాలకు మరమ్మతులు చేసి, ఆధునిక యంత్రాలపై శిక్షణను తిరిగి ప్రారంభించాలని కోరుతున్నారు. ఒకవేళ పరిశ్రమలు ఇక్కడికి రాకపోయినా శిక్షణ పొందిన వారు వేరే ప్రాంతాల్లోనైనా ఉద్యోగాలు పొందటానికి అవకాశముంటుందని చెబుతున్నారు. వారం క్రితం రాష్ట్ర లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అడిగొప్పుల మలుపు కేంద్రాన్ని సందర్శించి ఇక్కడ పరిస్థితులు చూసి వెళ్లారు. వీటిని తిరిగి ప్రారంభించటానికి సాధ్యసాధ్యాలను పరిశీలించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యువతకు శిక్షణ ఇవ్వాలి

రాయపాటి యోహాను, మాస్టర్ ట్రైనర్, మాచర్ల

రాష్ట్ర ప్రభుత్వం లిడ్‌క్యాపు ద్వారా 20 ఏళ్ల కిందట మద్రాసు సిఎల్‌ఆర్‌ఐ (సెంట్రరల్ లెదర్ రీసెర్చి ఇన్‌ట్యూట్)లో నాతోపాటు మాచర్ల చుట్టుపక్కల ఊర్లకు చెందిన 30 మందికి చెప్పులు, బూట్లు, లెదర్‌తో తయారు చేసే వస్తువులపై 45 రోజులుపాటు శిక్షణిప్పించింది. శిక్షణ పూర్తిచేసి తిరుగొచ్చిన మేము మాచర్ల, అడిగొప్పల మలుపు కేంద్రాలు (లెదర్‌పార్కుల్లో) యువతకు శిక్షణిచ్చాము. మొదటి బ్యాచ్ శిక్షణ పూర్తయిన తరువాత మలుపు కేంద్రాలు మూసివేశారు. అప్పటి నుండి ఎప్పటిలాగానే రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకుంటున్నాము. కొరియా వాళ్ళు ఇక్కడ లెదర్ పరిశ్రమలు ఏర్పాటు చేయటానికి స్థలాలు చూసి పోయారు. లెదర్ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతంలోని వేలాది చర్మకారుల జీవితాల్లో వెలుగులు వస్తాయి.

పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేయాలి

కోటయ్య, చర్మకారుడు, మాచర్ల

మా తాతల కాలం నుండి చెప్పులు కుట్టుకోవటమే మా వృత్తి. చెప్పుల తయారీపై అధారపడే వారు మన ప్రాంతంలో చాలా కుటుంబాలున్నాయి. తెలంగాణాలోని ఆలియా, మిర్యాలగూడ, కోదాడకు చెందిన ప్రైవేటు చెప్పుల వ్యాపారులు చెప్పుల తయారీ అర్డర్లు మన ప్రాంత చర్మకారులకు ఇస్తూంటారు. అయితే కొద్ది మొత్తం ఆర్డర్లు కావటంతో పెద్దగా ఆదాయం రాదు. మన ప్రాంతంలో చెప్పులు, బూట్లు, లెదర్‌తో తయారు చేసే వస్తువుల తయారీ పెద్ద పరిశ్రమలు వస్తాయంటున్నారు. ఇక్కడ కంపెనీలు పెడితే మాకు ఉద్యోగాలొచ్చి జీవితాలు బాగుపడుతాయి. రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకునే పరిస్థితి మారుతుంది.

ఈదురు గాలులు-మోస్తరుగా వర్షాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వాతావరణంలో మార్పులతో ప్రజల్లో అయోమయం నెలకొంటోంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుండగా సాయంత్రంకు ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. కొద్దిసేపు వాతావరణ చల్లబడినట్టు కన్పించినా తరువాత మళ్లీ ఉక్కపోత ప్రారంభం అవుతుంది. గుంటూరు, పల్నాడు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండగా తరువాత బలమైన ఈదురు గాలులు వచ్చాయి. పలు ప్రాంతాల్లో ఒక విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలుల వల్ల సంగం జాగర్లమూడి నుంచి గుంటూరు వచ్చే విద్యుత్ లైన్లు తెగిపడి గుంటూరు నగరంలో నీటి సరఫరాకు అంతరాయం కల్గినట్టు అధికార వర్గాలు తెలిపాయి. సోమవారం ఉదయం గుంటూరు వన్‌టౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఉండదని అధికారులు ప్రకటించారు. తెనాలి, పొన్నూరు, చేబ్రోలు, మంగళగిరి, తాడేపల్లి తదితర ప్రాంతాల్లో భారీగా ఈదురు గాలులు సంభవించాయి. ఒక మోస్తరుగా వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట, వినుకొండ, పెదకూరపాడు తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులు సంభవించాయి. పలాడు జిల్లాలో జల్లులు పడ్డాయి. పగటి సమయంలో వివిధ ప్రాంతాల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా తరువాత వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. రెంటచింతల, జంగమేశ్వరపురం తదితర ప్రాంతాల్లో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వేసవి తీవ్రత పెరగడంతో జిల్లాలోనిగ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు పెరిగాయి. అప్రకటిత విద్యుత్ కోత ప్రారంభమైంది. విద్యుత్ సమస్యలు పెరిగాయని, కానీ కోతలు లేవని అధికారులు చెబుతున్నారు. అంతరాయాలు పెరగడం, మరమ్మతుల సమస్యతోనే కొన్ని సందర్భాల్లో సరఫరాలో ఇబ్బంది ఏర్పడుతుందని అంటున్నారు.

ప్రజాశక్తి - పెదకూరపాడు

మిరపకాయలు, మొక్కజొన్న, పొగాకు పంట కళాల్లో ఉండగా నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో ఆదివారం సాయంత్రం వానకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు. పంటపై పట్టాలు కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు. శిల్పాలిన్ పట్టాలను సబ్సిడీపై కొన్నేళ్లుగా అందించని కారణంగా రైతులు పాత వాటినే వాడుకుంటున్నారు. వీటిల్లో కొన్ని అక్కడక్కడా దెబ్బతిని పంటపైకి నీరు చేరుతోంది. ఈ సారైన పట్టాలను అందించాలని రైతులు కోరుతున్నారు.

మృతుని ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం దూళిపాళ్ల గోరంట్ల వాగులో గుర్తుతెలియని పురుషుని మతదేహం లభ్యమైన విషయం విదితమే. మృతుడు సత్తెనపల్లి పట్టణానికి చెందిన పెదాల సాంబశివరావుగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని 21వార్డుకు చెందిన పెదాల సాంబశివరావు మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కాంట్రాక్టు కార్మికునిగా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసైన సాంబశివరావు విధులకు హాజరు కాకపోవటంతో తండ్రికి బదులు కుమారుడు పని చేస్తున్నాడు. మృతుడు వాటర్ బాటిల్స్, అట్టపెట్టెలు, ఖాళీ మద్యం సీసాలు ఏరుకుంటూ వాటిని విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో మద్యం సేవిస్తూ ఉంటాడని తెలిపారు.ఆక్రమంలో మద్యం మత్తులో ఫిట్స్ రావటంతో మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతునికి భార్య అన్నపూర్ణ కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అంద చేశారు.

లారీ కిందపడి ముఠామేస్త్రి మృతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మస్తాన్ వలీ (ఫైల్)

లారీ కిందపడి ముఠా మేస్త్రి మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం బగుబండ గోరంట్ల మేజర్ సమీపంలో ఆదివారం జరిగింది. ఈ ప్రమాదంలో రాజుపాలెం మండలం మొక్కపాడు గ్రామానికి చెందిన షేక్ బగుబండ దూద్ కా ఉరఫ్ మస్తాన్ వలీ (50) అక్కడికక్కడే మృతి చెందాడు. సత్తెనపల్లి నుండి బగుబండ సమీపంలో మొక్క జొన్నలు లోడు కోసం వెళుతున్న లారీ టివిస్ పై వెళుతున్న ముఠా మేస్త్రిని ఢీకొట్టడంతో లారీ చక్రాల కింద పడి మృతి చెందాడు. మృతునికి భార్య బుడెమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని సత్తెనపల్లి ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేశారు.

పోలీసుల అదుపులో నిందితులు

ఆరుగురు జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఆదివారం మధ్యాహ్నం హౌస్ గణేష్ గ్రామపొలాలలో డబ్బు లు పందెం పెట్టి కోతముక్క ఆడుతున్న ఆరుగురిని ఫిరంగి పురం పోలీసు వారు అరెస్టు చేసి వారి నుండి రూ.15,090లను స్వాధీ న పరుచుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ రవీం ద్రబాబు తెలిపినారు. ఈ రైడ్‌లో సబ్ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

వానతో పంట దెబ్బతిన్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి : రైతుసంఘం

ప్రజాశక్తి - తెనాలి రూరల్ : ఆదివారం కురిసిన వడగళ్ల వాన కారణంగా నష్టపోయిన జొన్న, మొక్కజొన్న రైతులను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.శివసాంబిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే రెండుసార్లు వర్షం కారణంగా రైతులు దెబ్బతిన్నఆరని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి నాణ్యత ప్రమాణాలను లెక్కించకుండా పంటలను మద్దతు ధరకు కొనాలని కోరారు.

కోదండరామాలంలో చోరీ
హుండీలను పగులగొట్టిన దుండగుడు

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల పట్టణంలో ప్రముఖ ఆలయమైన కోదండ రామాలయంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. వెయిన్‌రోడ్డులోని దేవాలయం ఉత్తర ద్వారానికి గొలుసుతో తాళం వేసివుంది. ఇనుపరాడ్డుతో గొలుసుని బద్దలు కొట్టి దొంగలోనికి ప్రవేశించాడు. గుడిలో వున్న రెండు కానుకలు వేసే హుండీల తాళాలను పగలగొట్టాడు. హుండీల్లోని నగదును దోచుకున్నాడు. దేవాలయ కమిటి అధ్యక్షులు రామారావు నీటిమోటర్ వేయటానికి ఆదివారం తెల్లవారుజామున ఆలయానికి చేరుకొని తలుపు తీయమని కేకలు వేశాడు. వాచ్‌మెన్ స్పందించకపోవటంతో తిరిగి మరో గంట తర్వాత గుడికి చేరుకున్నాడు. వాచ్‌మెన్ తలుపుతీయగా గుడిలోకి వెళ్ళిన రామారావుకు హుండీ తాళాలు పగలగొట్టి కనిపించాయి. దాంతో రామారావు పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న అర్బన్‌సిఐ ప్రభాకరరావు దేవాలయానికి చేరుకొని సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. శ్రీరామనవమి వేడుకలు సందర్భంగా సుమారు రూ.20లక్షల విలువైన వస్తువులు ఆలయంలోని దేవతామూర్తులకు అలకరించివున్నాయి. గర్భగుడి తలుపులు తీయటానికి ప్రయత్నించి దుండగుడు విఫల మైనాడు తలుపులు తెరిస్తే అభరణాలు కూడా చోరీ అయ్యేవి. కొన్ని రోజుల కిందట పాతబజారు వీరాంజనేయ స్వామి దేవాలయంలో హుండీని పగులగొట్టి నగదును దొంగిలించిన విషయం విదితమే. ఆ సంఘటన మరువక ముందే పట్టణ నడిబొడ్డున ప్రధాన రహదారి పక్కనున్న కోదండ రామాలయంలో చోరీ జరగటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దొంగలను పోలీసులు పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చోరీకి గురైన హుండీలు

మేఘనాథరెడ్డికి చంద్రశేఖరరావు సాహితీ పురస్కారం

ప్రజాశక్తి - గుంటూరు

మేఘనాథరెడ్డికి పురస్కారం అందచేస్తున్న డాక్టర్ ప్రసూన తదితరులు

వామపక్ష, దళిత, బహుజన సామాజిక సాహిత్య దలక్పథంతో డాక్టర్ వి.చంద్రశేఖరరావు రచనలు చేశారని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ సాహితీ విమర్శకులు పెనుకొండ లక్ష్మీనారాయణ అన్నారు. డాక్టర్ వి.చంద్రశేఖరరావు జయంతి సాహిత్య పురస్కార సభ ఆదివారం గుంటూరులో పెనుగొండ అధ్యక్షతన నిర్వ హించారు. చంద్రశేఖర్‌రావు వర్గీకరణ ఉద్యమ ప్రభావ నేపథ్యంలో ఆ ఉద్యమానికి దోహదం చేసే రచనలు సాగించారన్నారు. కథా సంపాదకులు వాసిరెడ్డి నవీన్ మాట్లాడుతూ చంద్రశేఖరరావు విలక్షణమైన రచనలను సోదాహరణంగా వివరించారు. సినీ దర్శకులు సి.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ చంద్రశేఖరరావు మార్క్సియన్ ఈస్తటిక్స్‌ని తన రచనల్లో ప్రతిబింబించారని గత చరిత్రకు సంబంధించిన ఉద్వేగాలను ద్రశ్యమానం చేశా రన్నారు. కలుంకూరి గుట్ట కథా సంపుటి రచయిత కె.వి. మేఘనాథరెడ్డి 2025వ సంవత్సరపు డాక్టర్ వి.చంద్ర శేఖరరావు సాహిత్య పురస్కారాన్ని డాక్టర్ వి.ప్రసూన ద్వారా అందుకున్నారు. కలుంకూరిగుట్ట కథల్లోని వైశిష్ట్యాన్ని విశ్లేషిస్తూ రాయలసీమ ప్రాంత కరువును అద్భుతమైన మాండలికంతో జానపదుల భాషలోని సౌందర్యాన్ని మేఘనాథరెడ్డి చిత్రించారని కందిమళ్ల శివప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో కాట్రగడ్డ దయానంద్, పుప్పాల శ్రీరాం, పాపినేని శివశంకర్, బండ్ల మాధవరావు, శ్రీశ్రీ విశ్వేశ్వరరావు పారాఅశోక్, మన్నం సింధుమాధురి పాల్గొన్నారు.

రెండో రోజుకు వైయస్సార్ నాటక కళాపరిషత్ నాటిక పోటీలు

ప్రజాశక్తి - తెనాలి

తరం వెళ్ళిపోతోంది నాటికలో సన్నివేశం

స్థానిక రామలింగేశ్వరపేట ఓపెన్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న వైయస్సార్ నాటక కళాపరిషత్ ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారం రెండో రోజుకు చేరాయి. నాటిక పోటీలలో భాగంగా గుంటూరు కరణం సురేష్ మెమోరియల్ థియేటర్ వారు ప్రదర్శించిన 'తరం వెళ్ళిపోతుంది' నాటిక సందేశాత్మకంగా సాగింది. దశరథ రామయ్య, శేషయ్య ఇరువురు ప్రాణ స్నేహితులు. శేషయ్య తండ్రి తనను చదివించడంతో ప్రయోజకుడై టీచరుగా పనిచేసే పదవి విరమణ చేస్తాడు. దశరథ రామయ్య తండ్రి ఆర్థిక స్తోమత లేక అతనిని చదివించలేకపోతాడు. దశరథ రామయ్య కు రాఘవరావు, రంగనాథం ఇద్దరు కొడుకులు. వారిని శేషయ్య మాస్టర్ సలహాలతో చదివిస్తుంటాడు. పెద్ద కొడుకు తెలివైనవాడు. కష్టపడి చదివి మంచి ర్యాంకులు సాధిస్తూ ఉంటాడు. ఒకోసారి అతను చదువులు కోసం చిన్న కొడుకుని కూలికి పంపిస్తాడు దశరథరామయ్య. ఉన్నది మొత్తం అమ్మి పెద్ద కొడుకు చదువుకు ఖర్చు చేస్తాడు. దశరథరామయ్య అర్ధాంతరంగా చనిపోతే, అతను చేసిన అప్పుకు చిన్న కొడుకే భాద్యత తీసుకుంటాడు. పెద్ద కొడుకు ఆఫీసరవుతాడు. చిన్నకొడుకు మాత్రం రిక్షా కార్మికుడిగా మిగిలిపోతాడు. వారిద్దరి మధ్య ఏర్పడిన మంత్రాలతో దూరంగా ఉంటారు. విషయం తెలుసుకున్న శేషయ్య మాస్టర్ ఇద్దరి మధ్య విభేదాలు గుర్తించి సరి చేసే ప్రయత్నం చేస్తాడు. రరక్తసంబందాల విలువలు తెలియక కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని వారిని హెచ్చరించి ఒకటి చేస్తాడు. నాటికకు రచన, దర్శకత్వం రామకష్ణ వహించారు.

19న వాక్ ఫర్ జీసస్

ప్రజాశక్తి - మంగళగిరి

క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరి టౌన్ లూథరన్ చర్చి నందు వాక్ ఫర్ జీసస్ కార్యక్రమానికి సంబంధించి కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ నెల 19 వ తేదీ ఉదయం 6 గంటలకులకు మంగళగిరి అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి వాక్ ఫర్ జీసస్ ప్రేయర్ ర్యాలీప్రారంభం అవుతుందని తెలియజేశారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న యాక్షన్ కమిటీ సభ్యులు

వాదులాటకు దిగిన ఇరుపక్షాలు

సత్రం కమిటీ ఎన్నిక రసాభాస

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బోస్ రోడ్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవస్థానం సత్రం కమిటీ సర్వసభ్య సమావేశం, కార్యవర్గ ఎన్నిక రసాభాసగా మారింది. వాస్తవానికి కమిటీ సర్వసభ్య సమావేశానికి ఇన్చార్జి కార్యదర్శి వక్కలగడ్డ రామ్మోహన రావు ఆదివారం పిలుపునిచ్చారు. సభ్యులకు సమావేశం ఆహ్వానం పంపారు. టిడిపి, వైసిపి నాయకుల సారథ్యంలో ఎన్నికలకు సిద్ద పడి ఇరువర్గాలు ఆలయ ఆవరణలో ప్రవేశించారు. అయితే కమిటీ సభ్యులు కాని వారు కూడా ఆలయంలో ప్రవేశించటం, వారి అనవసర జోక్యంతో సమావేశం పక్కదారి పట్టింది. ఓ దశలో ఇరువర్గాల మధ్య తోపులాట కూడా జరిగింది. దీంతో జోక్యం చేసుకున్న పోలీసులు డిఎస్పి బి.జనార్ధనరావు సారథ్యం లో పోలీసులు కమిటీ సభ్యులు కాని వారిని బయటకు పంపిం చేందుకు ఉపక్రమించారు. అయితే ఎట్టి పరిస్థితుల్లో ఎన్నిక జరిగి తీరాలని ఓ వర్గానికి నాయకత్వం వహించిన పెండ్యాల వెంకటరావు భీష్మించారు. బయటి వ్యక్తుల ప్రమేయంతో ఆలయ కమిటీని భ్రష్టు పట్టిస్తున్నారంటూ మరో వర్గం ఆరోపిం చారు. ఈ నేపథ్యంలో పోలీసులు జోక్యం చేసుకొని ఇరు వర్గాలకు సర్ది చెప్పి, వచ్చే మంగళవారం ఎన్నిక నిర్వహించు కోవాల్సిందిగా సూచించడంతో ఆందోళన సద్దుమణిగింది.

కఠెవరంలో వంగవీటి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి మండలంలోని కఠెవరం గ్రామంలో ఆదివారం వంగవీటి మోహన రంగ విగ్రహం ఆవిష్కరించారు. విజయవాడ మాజి శాసనసభ్యులు వంగవీటి రాధాకృష్ణ తన తండ్రి విగ్రహాన్ని ఆవిష్కరించి ఆ ప్రాంతాన్ని వంగవీటి రంగా సెంటరుగా నామకరణం చేశారు. కృష్ణ గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభ్రదుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, పొన్నూరు మాజి శాసన సభ్యులు కిలారి రోశయ్య ముఖ్య అతిథులుగా పాల్గుని మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బండికళ్ల ప్రసాద్, నాసా శాస్త్రవేత్త చందు సాంబశివరావు, గాదె వెంకటేశ్వరరావు, తోటకూర రమణారావు, కేశన శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల కలిసి పోరాడే సమయం ఆసన్నం

తుమ్మలపాలెం అమరవీరుల సంస్మరణ సభలో వివిధ పార్టీల నాయకులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మతోన్మాద చర్యలతో ప్రజలను విభజిస్తూ ప్రజలపై భారాలను మోపుతోందని కార్పొరేటు శక్తులకు అను కూలంగా కార్మిక చట్టాల్లో మార్పు లు చేసి కార్మికులను వెట్టి చాకిరికి గురిచేస్తుందని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై. రాధాకష్ణ అన్నా రు. తుమ్మలపాలెంలో అమర్ నగర్‌లో ఆదివారం జరిగిన అమరవీ రుల స్మారక సభకు అధ్యక్షత వహించి ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నూతన పాలసీలను తీసుకొస్తూ రైతాంగాన్ని మరింత సంక్షోభంలోకి నడుతుంద న్నారు. బిజెపి ఆర్‌ఎస్ ఎస్ ఎజెండాను నిలువరించి పోరా డాలంటే వామపక్ష ప్రజాస్వామ్య ప్రగతి శీలురు లౌకిక వాదులంతా ఐక్యంగా పోరాటమే అమర వీరులకు అర్పించే నివాళి అన్నారు. చంపబడ్డ ఆరుగురు అమరుల రక్తంతో పునీతమైననేల ఈ తుమ్మలపాలెం అమర అన్నారు. తెలంగాణ పోరాటానికి స్థానిక భుస్వాముల వ్యతిరేకంగా ఉద్యమించిన కారణంగా మరో 11మంది వీరుల కోసం, శ్రీకాకుళం ఉద్యమన్ని బాసటగా నిలిచి ఉమ్మ డి గుంటూరు జిల్లాకు చెందిన 10 మంది వీరుల జ్ఞాప కంగా స్థూపాలను నిర్మించుకుని ప్రతి ఏటా ఏప్రిల్ 13న ఇక్కడ స్మారక సభలో జరుపు కుం టున్నామన్న సంగతి గుర్తు చేశారు. వారితో పాటుగా శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటానికి వెన్నుదన్నుగా నిలిచి అమరులైన అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా యోధులకు ఘన నివాళి అర్పించారు. అనంతరం మాట్లా డుతూ వామపక్షాలు ఐక్యమత్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా లు అనుసరి స్తున్న విధానాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాల్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంద న్నారు. బిజెపి మతోన్మాద విధానాలను తిప్పి కొట్టాల న్నారు. కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ ధోరణికి మరో

వేదికపై సంతాపంగా మౌనం పాటిస్తున్న నాయకులు

ఉదాహరణ నియో జకవర్గాల పునర్వి భజన అన్నారు. మతోన్మాదం పేరుతో నయా ఉదారవాదాన్ని దూకుడుగా అమలు చేసేందుకు ప్రయత్నాలను తిప్పి కొట్టా లన్నారు. పేదల భూములను కార్పోరేట్ సంస్థల చేతుల్లోకి పోతున్నా యన్నారు. వేల ఎకరాలు పెద్దపెద్ద కార్పొరేట్ కంపెనీల స్థాపనకు ఇస్తే అందులో 20 శాతం పరిశ్రమలు కూడా నిర్మించలేదన్నారు ఆ భూములతోనే రియల్ ఎస్టేట్ వ్యాపా రం చేయటం దారుణమైన విషయం అన్నారు. ముఖ్య అతిథి సిపిఐ నాయకులు ఏ. మారుతి వరప్రసాద్ మాట్లా డుతూ తుమ్మల పాలెం అమరవీరుల చిహ్నంగా 1997లో స్థూలాలను నిర్మించి ఈ స్థూపాల వద్ద అప్పటినుంచి అన్ని కమ్యూనిస్టు గ్రూపులు ఐక్యంగా సభ నిర్వహిస్తున్నా యన్నారు. ఎంసిపిఐ (యు).. నాయకులు ఖాదర్ బాషా మాట్లాడుతూ దేశంలో బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ విధానాలను పక్కాగా అమలు చేస్తోందన్నారు. ఎంసిపిఐ నాయకులు కాసాని గణేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ప్రాంతం ప్రత్యేకంగా అమరవీరులకు గుర్తింపును తెచ్చిందన్నారు. న్యూ డెమోక్రసీ ఎమ్మెల్ నాయకులు మేకల ప్రసాద్ మాట్లాడుతూ దున్నే వానిదే భూమి లక్ష్యంతో పోరా టం ప్రారంభమై తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న బలపరిచిన వారిని ఆనాడే పిట్టలను కాల్చినట్టు కాల్చివేశా

అమర వీరులకు నివాళి అర్పిస్తున్న నాయకులు

రన్నారు. సిపిఐ ఎంఎల్ నాయకురాలు మండల శోభారాణి మాట్లాడుతూ మతోన్మాద బిజెపి విధానాలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడాల్సిన సమయం ఆసన్న మైంద న్నారు. సిపిఎంఎల్ నాయకులు గుర్రం విజయకుమార్ మాట్లా డుతూ ఒక్క స్థానం కూడా ఆంధ్రప్రదేశ్‌లో బిజెపికి లేదని అయినా బిజెపి పాలన పక్కాగా నడుస్తోందని అన్నా రు. ముందుగా తెలంగాణ పోరాట కాలస్త్రులో అమరులైన గుంటూరు జిల్లా వీరులు ఆళ్ల వెంకయ్య, దం డా అంకమ్మ, బండారు వెంకట ప్పయ్య, దండా నారాయణ స్వామి, పిళ్లి అంకమ్మ, కొండ్రగుంట్ల రాములు, మామిడాల సుబ్బారావు, కోనేటి బ్రహ్మయ్య, తల్లం శ్రీమన్నారాయణ, దమ్ము పోతు రాజు, మూకిరి మోషే,కట్ట దామోదరం, గడ్డం మోషే కాకాని రామచంద్రయ్య, ఏనుగుపాలెం కోటయ్య, దావల గంగయ్య, నేలకు దింటి సత్యనారాయణ, అమర వీరులతో పాటుగా శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటా నికి వెన్నుదన్నుగా నిలిచి అమరులైన యోధులైన చాగంటి భాస్కర రావు, బిక్కి రాములు, యోగి సుబ్బారెడ్డి, పరికల బిక్షాలు, గుడివాడ జగన్నాథం, డాక్టర్ దేవినేని మల్లికార్జు నుడు, జి.కోటేశ్వరరావు, డి.జగదీష్, సాంబయ్య, గోగినేని వీరయ్యకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కమ్యూ నిస్టు సీనియర్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

షేక్. రూఖియా భాను అభినందిస్తున్న కళాశాల డీన్

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు

ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థుల 100 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలో స్థాపించిన మొదటి సంవత్సరం లోనే నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు స్టేట్ ర్యాంకు లు సాధించాలని కళాశాల డీన్ షేక్. సుభాని ఆదివారం తెలి పారు. ఇంటర్ మొదటి ఏడాది 169 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 154 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఎంపిసిలో 470 మార్కులకు షేక్.అబ్దుల్ కవి 466 సాధించాడని, 12 మంది విద్యార్థులు 460 కి పైగా మార్కులను సాధించారన్నారు. బైపిసి లో 440 మార్కులకు షేక్. రూఖియా భాను 430 మార్కులు సాధించిందన్నారు. ఇంటర్ ద్వితీయ ఏడాది విద్యా ర్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఈ సంద ర్భంగా కలశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో డీన్ సుభాని, ప్రిన్సిపల్ భాష, ఆర్.జి.ఎం శ్రీనివాసిరెడ్డి, ఏజిఎం రామకృష్ణ విద్యార్థులను అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో 'అభినందన' టాప్

ప్రవల్లిక

యేనేష్‌బాబు

ప్రజాశక్తి - పెదకూరపాడు

ఇంటర్ ఫలితాలలో అమరావతి పెదకూరపాడు మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు అభినందన కళాశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 462 మార్కులు యేనేశ్ బాబు సాధించి టాపర్ గా నిలిచాడు అన్నారు. జూనియర్ ఇంటర్ బైపిసిలో ప్రవల్లిక 424 మార్కులు సాధించి నియోజకవర్గంలోనే ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ కొమ్మాలపాటి శ్రీధర్ అభినందించారు.

జాతీయ అవార్డు అందుకుంటున్న బాజీ

జాతీయ అవార్డు అందుకున్న బాజీ

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని కన్నెగండ్ల గ్రామానికి చెందిన విద్యావం తుడు కాకతీయ పబ్లిక్ స్కూల్ హిందీ పండిట్ ఉపాధ్యాయుడు ఎస్.కే బాజీ ఆదివారం మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణ్ రావు చేతుల మీదుగా అందుకున్నారు.విద్యాభివద్ధికి సామాజిక సేవలకు గాను ఎస్. కే బాజీ కి అంబేద్కర్ ప్రతిభ జాతీయ అవార్డు అందు కున్నారు. ప్రవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఆర్గనైజేషన్ వారు అవార్డును అందించారు. బాజీని మండలంలోని మేధావులు విద్యావంతులు ఉపాధ్యాయులు అభినందించారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రజలు పుక్కిట పురాణ పాత్రలను గుడ్డిగా పూజించడం కాకుండా శాస్త్రీయ దక్పథాన్ని అలవర్చుకొని చైతన్య వంతంగా మెలగాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రం రొంపిచర్ల బిసి కాలనీలో భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమి టీ ఆధ్వర్యంలో "శాస్త్రీయ ఆలోచనలు వాటి అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్య అతిథిగా డాక్టర్ బ్రహ్మా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేధావుల మౌనం దేశ, రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం అని దేశంలో, రాష్ట్రంలో అనేక సమస్యలు ఉత్ప న్నమవుతున్న వేళ ఆ సమస్యల పరిష్కారానికి ఒకటో, రెండో సంస్థలు పని చేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని, భావసా రూప్యంగల అన్ని సంస్థలు కలిసి పని చేయడం ద్వారా సాధ్యమన్నారు. ప్లాస్టిక్ సర్జరీ వంటి అధునాతన వైద్య ప్రక్రి యలు పురాణ కాలంలో అందుబాటులో ఉన్నాయని అత్యు త్తమ పదవులలో ఉన్నవారు చెప్పటం హేయమన్నారు. సమా జాన్ని శాస్త్రీయ దష్టి వైపు మళ్లించాల్సింది పోయి తిరోగమన భావాలను వ్యాప్తి చేయటం దేశానికి క్షేమం కాదని ఆవేదన

మాట్లాడుతున్న డాక్టర్ వెన్నపూస బ్రహ్మానంద రెడ్డి

వ్యక్తం చేశారు. ఆడ పిల్లలను అణచి వేసే పురాణాలు కోకొల్ల లుగా ఉన్నాయన్నారు. అనంతరం ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. జ్వరం వచ్చిన 5 రోజుల తర్వాత కూడా తగ్గకుంటే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. సహజ రోగ నిరోధక శక్తి నిలుపుకోవటం కోసం శారీరక శ్రమ, వ్యాయామం సమతుల ఆహారం ముఖ్యమన్నారు. షుగర్ వ్యాధిగ్రస్తులు రోజుకు రెండు పూటలు ఆహారం తీసుకుంటే చాలని మూడవ పూట తినకుండా ఉంటే ఇన్సులిన్ స్థాయిలు పడిపోవని తెలిపారు. కార్యక్రమంలో భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ సరికొండ రామకృష్ణంరాజు శేషం రాజు, మస్తాన్ వలి, జనవిజ్ఞాన వేదిక నాయకులు శ్రీ వేములయ్య, అమ్మ నేత్ర అవయవదాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ చలపతిరావు ప్రజలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని ఇచ్చిన ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని, గత ఐదు సంవత్సరాలుగా భవన నిర్మాణ కార్మికుల క్లైముల పరిష్కారానికి అడ్డంకిగా ఉన్న మెమో నెంబర్ 1214 రద్దు చేసి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులు పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మిక ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కోశాధికారి గోపాలరావు ఆదివారండిమాండ్ చేశారు. ఎడ్లపాడు భవన నిర్మాణం కార్మికుల అడ్డా వద్ద భవన నిర్మాణ కార్మికుల కర పత్రాన్ని వారు ఆవిష్కరిస్తూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 24వ తేదీనపలనాడు జిల్లా నరసరావుపేట కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసు కొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని భవన నిర్మాణ కార్మి కుల సంక్షేమం కోసం వసూలు చేసిన సెస్ నిధులను కార్మి కుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని వివిధ సందర్భాల్లో రాష్ట్ర ప్రభు త్వం తీసుకున్న సంక్షేమ బోర్డు నిధులను తక్షణమే

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సంక్షేమ బోర్డులో జమ చేయాలని భవన నిర్మాణ కార్మికుల అడ్డాల్లో మౌలిక సదు పాయాలు కల్పించాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారా యణ, పలనాడు భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిలార్ మసూద్ ఎ డ్లపాడు భావన నిర్మాణ కార్మిక అ ధ్యక్ష కార్యదర్శులు వెంకట్రావు ఆంజ నేయులు గ్రామ భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

20 మందికి సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గత పాలకుల అవినీతితో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్షీణించినప్పటికీ, గత ప్రభుత్వం నిలిపివేసిన సీఎం ఆర్‌ఎఫ్ సాయాన్ని కూటమి ప్రభుత్వం పునరుద్ధ రించిందని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం తెలిపారు. వివిధ అ నారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రభుత్వ సాయానికి దరఖాస్తు చేసుకున్న 20 మందికి ఆయన నివా సంలో సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం వారితో మాట్లాడుతూ పేదల సంక్షేమం, సంతోషానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందనే వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాల న్నారు. 20 మంది లబ్ధిదారులకు రూ. 14.59 లక్షల విలువైన చెక్కుల్ని అందించారు.

స్వయం ఉపాధి రుణాలు అంద చేత

ప్రధానమంత్రి గ్రామీణ్ ఆవాస్ యోజన పథకంలో ఇళ్లు నిర్మించుకొని చిరు వ్యాపారాల తో ఉపాధి పొందాలనుకునే గ్రామీణ ప్రాంతాల వారికి బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలిస్తున్నాయని, ఆసక్తి ఉన్నవారు అవకాశాల్ని సద్వినియోగం చేసు కోవాలన్నారు.స్వయం ఉపాధి, చిరువ్యాపారాల నిమిత్తం బ్యాంకుల నుండి మంజూరైన రూ. 16 లక్షల రుణాల్ని బ్యాంకులు ఎంపిక చేసిన 10 మంది లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమం లో టిడిపి నాయకులు షేక్ టీడీపీ కరీ ముల్లా, నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మధన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయి బాబు పాల్గొన్నారు.

16న మిర్చియార్డు వద్ద ధర్నాను జయప్రదం చేయండి

కరపత్రాలు పంపిణీ చేస్తున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్

ప్రజాశక్తి - తాడికొండ

ఈ నెల 16వ తేదీన రైతు సంఘం ఆధ్వర్యంలో మిర్చి రైతులను ఆదుకోవాలని కోరుతూ గుంటూరు మిర్చి యార్డు వద్ద జరుగనున్న ధర్నా ను జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్ కోరారు. తాడికొండ మండలంలోని రావెల,బేజాత్ పురం, పాములపాడు గ్రామాల్లో ఈ మేరకు కరపత్రాలను పంపిణి చేసారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మిర్చి క్వింటాల్ కి కనీస మద్దతు ధర రూ. 20వేలుగా ప్రకటించాలన్నారు. రాష్ట్రంలో 4లక్షల ఎకరాల్లో 2లక్షల 70 వేల మంది రైతులు మిర్చి పంట పండిస్తున్నారు. సగం పంట ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే పండిస్తున్నారని, మిర్చి పంటకు అధిక పెట్టుబడులతో పాటు, వ్యవసాయ కూలీలు కూడా అధికసంఖ్యలో పనిచేస్తారని అన్నారు. మిర్చి ఎకరాకు 2.25 లక్షల నుండి 3.25లక్షల వరకు పెట్టుబడి అవుతుందని సగటున ఎకరాకు 20క్వింటాలు దిగుబడులు వస్తే నేటి మార్కెట్ ప్రకారం 10 వేల రూపాయలకు రైతు అమ్మితే వచ్చే రాబడి రూ.2లక్షలు,రైతు 25 వేల నుండి 1.25లక్షల వరకు నష్టపోతున్నారు. కౌలురైతులు అదనంగా 20వేలు ఎకరాకు కౌలు చెల్లించాలి.ఇటువంటి పరిస్థితులలో రైతు సంఘాలతో చర్చించకుండా ప్రభుత్వం క్వింటాకు రూ.11,781/- ల స్కీమ్ను గొప్పగా ప్రకటించడం జరిగిందని తెలిపారు.ఈ స్కీమ్ విధివిధానాలు ఇప్పటికి స్పష్టంగా లేనప్పటికీ పంట అమ్ముకున్న రైతుకు డబ్బులు అందలేదని అన్నారు..ఈ స్కీమ్ ప్రకారం .20వేల ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అందించగలిగితే మిర్చిరైతులు అప్పులో నుండి బయటపడి ఆత్మహత్యలు నివారించడానికి అవకాశం ఉంటుందని అన్నారు.. కనీస మద్దతు ధర ఇవ్వగలిగితే దళారుల దోపిడి దారులను అరికట్టవచ్చన్నారు.మిర్చి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వాం,కనీస మద్దతు ధర 20వేలుగా ప్రకటించాలి.వ్యాపారుల కొనుగోలుపై ప్రభుత్వం క్వింటాకు రూ. 5000 బోనస్ ఇవ్వాలి.. రైతు సేవా కేంద్రాల్లో మిర్చి వేసిన రైతులందరినీ ఈ క్రాప్లో నమోదు చేయాలి.ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ. 11,751ల కి తక్కువకు అమ్ముకున్న రైతుల పేర్లు రైతు సేవా కేంద్రంలో ప్రకటించాలి. ధరల స్థిరీకరణ నిధికి రూ.3000కోట్లు కేటాయించాలి. ఎగుమతులకు ఉన్న అవకాశాలను పరిశీలించి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి, కౌలురైతులను గుర్తించాలి. గుంటూరు మిర్చి యార్డును ప్రక్షాళన చేసి రైతులకు అనుకూలమైన వ్యాపార కేంద్రంగా మార్చాలని కోరుతూ రైతు సంఘం తరపున డిమాండ్ చేస్తున్నామని అయన అన్నారు. కార్యక్రమంలో బిక్కి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

రైతు సంఘం జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్

ముగిసిన శ్రీధర్స్ మెమోరియల్ షటిల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - తెనాలి

విన్నర్స్ కు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ఇటీవల మఅతి చెందిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు డాక్టర్ శ్రీధర్ స్మారకంగా స్థానిక చెంచుపేటలోని ఇండోర్ స్టేడియంలో శ్రీధర్ మెమోరియల్ షటిల్ బ్యాట్మెంటన్ టోర్నమెంట్ ఆదివారం నిర్వహించారు. స్టేడియంలో క్రీడాకారులను సీనియర్స్, జూనియర్స్ విభాగాలుగా విభజించి నిర్వహించిన పోటీలలో జూనియర్స్ విభాగంలో విన్నర్స్ గా వినయ్ కుమార్, శ్రీమన్నారాయణ, రన్నర్స్ గా రాజా, వరుణ్, సీనియర్స్ విభాగంలో పండు, చంటి విన్నర్స్ గా, అఖిలేష్, బాబి రన్నర్స్ గా నిలిచారు. బెస్ట్ ప్లేయర్స్ గా సాయి చరణ్, విజ్ఞాన్ నిలిచారు. టోర్నమెంట్ ద్వారా లభించిన ఎంట్రీ ఫీజు రూ.13వేలు, స్పాన్సర్ లోకేష్ అందించిన రూ.10వేలు మొత్తం రూ.23 వేల నగదును శ్రీధర్ కుటుంబ సభ్యులకు అందించినట్లు నిర్వాహకులు శ్రీనివాస్, సాయి లలిత తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

ప్రభుత్వ కాలేజీ ఇంటర్ విద్యార్థులకు ఎమ్మెల్యే నరేంద్ర అభినందనలు

ప్రజాశక్తి - చేబ్రోలు

ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన ప్రభుత్వ జూనియర్ ఇంటర్ విద్యార్థులకు అభినందనలు తెలిపిన ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్. పొన్నూరు నియోజకవర్గం చేబ్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ చూపినందుకు ఆయన సంతోషాన్ని వెలిబుచ్చారు. మొదటి మరియు ద్వితీయ సంవత్సరాల్లో 91% ఉత్తీర్ణత సాధించెందుకు కిషి చేసిన ప్రిన్సిపల్ మరియు అధ్యాపక బృందానికి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కళాశాలలో అత్యధికంగా మంచి మార్కులు సాధించిన ఎంపీసీ లో 962 మార్కులు సాగించిన విద్యార్థిని పి నజ్మా, బై పి సి నందు 920 సాధించిన జి శ్యామల, ఎంపీసీ లో 918 మార్కులు సాధించిన కె లక్ష్మీ దుర్గ, సి ఈ సి విభాగం లో 760 మార్కులు సాధించిన శ్యాం సోనీలకు వారి తల్లి దండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు .ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన రెండు తెలుగు రాష్ట్రాల విద్యార్థిని, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉచితంగా జ్యోతిరావు పూలే సినిమా ప్రదర్శన

ప్రజాశక్తి-తెనాలిరూరల్

సిని దర్శకులు పిఎం సుందర్ రావు పెమ్మసాని థియేటర్లో ప్రదర్శిస్తున్న జ్యోతిరావు పూలే సినిమాను ఆదివారం స్వయంగా వీక్షించారు. తెనాలి తారలు నటిస్తున్న ఈ చిత్రం ఇటీవల విడుదలై పెమ్మసాని థియేటర్లో ఉదయం ఆట ప్రదర్శిస్తున్న సంగతి తెలిసిందే. మరో ముఖ్య అతిగా పాల్గున్న శిశిరం దర్శకులు కనపర్తి రత్నాకర్ సినిమాను ఉద్దేశించి మాట్లాడుతూ భారీ సెట్టింగులను ఊహించకుండా సినిమాలో భావపరమైన అంశాలను చూడాలని అన్నారు. ఆనాటి పరిస్థితులకు అనుగుణంగా సన్నివేశాలను చిత్రీకరించడం ముదావహమన్నారు. దర్శకులు సుందర్ రావు మాట్లాడుతూ ఆర్థికపరమైన అంశాలను పక్కనపెట్టి సినిమాలో నటనకోసమే తెనాలి ప్రాంతీయులు పాత్రలుపోషించడం ఆనందదాయకమన్నారు. సినిమాను ఉచితంగా ప్రదర్శించేందుకు సహకరించిన బెల్లంకొండ వెంకట్ అభినందనీయులన్నారు. తెనాలి పురపాలక ఉన్నత పాఠశాలల్లో



సినిమాలో నటీనటులను సత్కరించిన సినీ దర్శకులు సుందరరావు

విధులు నిర్వహిస్తున్న అలపర్తి వెంకటేశ్వరరావు, బెల్లంకొండ వెంకట్ లను, ఎస్టియు రాష్ట్ర నాయకులు అంబరీష్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు అహమ్మద్ హుస్సేన్ దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సహజకవి డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, వెలగా సుభాష్ చంద్రబోస్, ఇఎల్వి అప్పారావు, హేమంతు, ఆంజనేయ శర్మ, ప్రసాద్ రెడ్డి, జీ వెంకటేశ్వర్లు, ఎన్ఎంఎంఎస్ ప్రకాష్, షరీఫ్, ప్రసాద్, భవాని, నగరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

సోషలిజంతో అందరికీ మేలు

ప్రజాశక్తి- తాడేపల్లి

మాట్లాడుతున్న ఎస్.వెంకట్రావు

సమాజంలోని ప్రజలందరికీ సోషలిజం అనే మహత్తర ఆశయం అమలుతోనే మేలు జరుగుతుందని ప్రజాశక్తి బుక్ ఎడిటర్ ఎస్ వెంకటరావు చెప్పారు. ఆదివారం రాత్రి తాడేపల్లి సుందరయ్య నగర్ విస్తృత సమావేశంలో ఆయన పాల్గని మాట్లాడారు. సమావేశానికి సిహెచ్ భుజంగరావు అధ్యక్షత వహించారు. వెంకట్రావు మాట్లాడుతూ కూటం ప్రభుత్వం పై ప్రజల్లో అసంతఅప్తి నెలకొందని విశ్లేషించారు. తాడేపల్లి పట్టణం లోని రైల్వే, ఇరిగేషన్, పోరంబోకు, స్థలాల్లో నివస ముంటున్న అందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కార్యదర్శివర్గ సభ్యు లు గాది సుబ్బారెడ్డి మాట్లాడుతూ సనాతన ధర్మం పేరుతో దేశాన్ని వెనక్కి తీసుకెళ్లడానికి కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ఒకే దేశం ఒకే ఎన్నిక అని చెబుతున్నా పాలకులు, అన్ని పండుగలు కలిపి ఒకేసారి చేయగలవా అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు నారిన నాగేశ్వరరావు, ఎస్ గిరిజ, సిహెచ్ భుజంగరావు, బి.రామారావు, కే విజయలక్ష్మి, కొండబాబు, పి రామచంద్రరావు, ఎస్ కే భాష తదితరులు పాల్గొన్నారు.

కాదు సుమా కల అనే నాటకంలోని భాగాలు, పాటలు పాడుతున్న విద్యార్థులు

విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు

విశేషంగా అలరించిన నాటకాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఆత్మహత్య చేసుకోవాలను కోవటం పి రికి తనం కాదు అందుకు కొండంత ధైర్యం కావాలి అందులో కొంత భాగం బ్రతకడానికి ఉపయోగించు ఇది చిలు వూరు గ్రామానికి చెందిన అంబేద్కర్ ఆర్ట్స్ వారిచే ప్రదర్శించబడిన కాదు సుమా కల అనే నాటకంలోని ఒక దఅశ్యం .చిలువూరు గ్రామంలోని కెవిఎస్ హైస్కూల్ శతవసంతాల నాటక ఉత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి ప్రదర్శించి బడిన ఈ నాటకం ప్రస్తుత సమాజంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారికి ఇచ్చిన సందేశం స్థానికులచే ప్రదర్శించబడిన ఈ నాటకంలోని సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అంతకుముందు సాంస్కఅతిక కార్యక్రమాలు నఅత్య ప్రదర్శనలు విద్యార్థిని విద్యార్థులు నిర్వహించారు. అనంతరం మూల్యం కనువిప్పు లాంటి నాటకాలు ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమాలకు స్థానికుల నుండి విశేష ప్రోత్సహం లభించినది. అకస్మాత్తుగా చెలరేగిన గాలి దుమారం కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగించినప్పటికీ నిర్వాహకులు సమయస్ఫూర్తిగా వ్యవహరించి ట్రాన్స్కో అధికారులను సంప్రదించి విద్యుత్తును సకాలంలో అందించే ఏర్పాటు చేశారు. దీనితో కార్యక్రమాలు యధాతథంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల శాశ్వత ట్రస్ట్ కాట్రగడ్డ నారాయణ పిన్నమనేని మురళీకఅష్ణ స్థానికులు జెట్టి బాలరాజు వై బ్రహ్మేశ్వర రావు ప్రిన్సిపల్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు..

ఉత్తమ ఫలితాలు సాధించిన వడ్డేశ్వరం జెడ్పి హైస్కూల్ ప్లస్ విద్యార్థినులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్ మహిళా కళాశాల విద్యార్థినిలు శనివారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ఉత్తీర్ణతను సాధించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 29 మంది విద్యార్థులు హాజరవ్వగా తొమ్మిది మంది ఉత్తీర్ణతను సాధించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం 21 మంది విద్యార్థులకు గాను పదిమంది ఉత్తీర్ణతను సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థిని పూజిత 470/445 మార్కులతో టాపర్గా నిలిచింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని దివ్యశ్రీ 893/1000, ఎస్కే రేష్మ 885/1000 మార్కులతో టాపర్ గా నిలిచారు. దీంతో పలువురు ఉపాధ్యాయులు, కళాశాల అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

131వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లి

ఏ సి సి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న రిలే దీక్ష ఆదివారం నాటికి 131 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో డి నాగేశ్వరరావు, సాంబశివరావు, వై నాగేశ్వరరావు, ఎం గురవయ్య, కే హగ్గయ్య కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, బి అంకయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీ నాగేశ్వరరావు, ఎస్ కే ఆరిఫ్, బి.సూర్యప్రకాశ్రావు, ఎం.ఆశీర్వాదం, టి.దుర్గా భవాని, ఎస్ కే మామ్ బి, ఎస్ కే భాష, వై.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- తాడేపల్లి

సుందరయ్య నగర్ ఒకటో రోడ్డులో భక్తుల రాజు భవన్ భవన నిర్మాణ కార్యాలయం సిఐటియు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం కార్యక్రమంలో సిఐటియు నాయకులు బైన బోయిన చంద్రశేఖర్, బత్తుల రాజు భవన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కళ్యాణాన్ని జరిపిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి దంపతులు

వైభవంగా మాచర్ల చెన్నుడి కల్యాణం

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు

ప్రజాశక్తి - మాచర్ల

చైత్ర పౌర్ణమి సందర్భంగా పండు వెన్నెల కాంతిలో పల నాటి ప్రజల ఇలవేల్పు శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి కల్యాణం శనివారం రాత్రి వైభవంగా జరిగింది. మాచర్ల శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి వార్షిక బ్రహోత్సవాలను పురస్కరించుకొని జరిగిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి వారి కళ్యాణం నయనానందకారంగా సాగింది. మాచర్ల నియోజక వర్గ శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, శోభారాణి దంపతులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలను సమర్పించారు. పీఠలపై కూర్చుని కల్యాణం జరిపించారు. ముందుగా నూతన వధూవరులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి వార్ల ఉత్సవ విగ్ర హాలతో పాతబజార్‌లో ఎదురుకోల నిర్వహించి, పురవీధు ల ఊరేగింపుగా కళ్యాణ మండపంలోకి తోడ్కొని వచ్చారు. కళ్యా ణోత్సవాన్ని ఈవో పూర్ణచంద్రరావు, కమిటి సభ్యులు పర్యవేక్షిం చారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సాయికృష్ణ మల్టీస్పెషలిటీ హాస్పిటల్స్ ఉచిత వైద్యశిబిరం విజయవంతం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లి పట్టణంలో నరసరావుపేట రోడ్డులో నూతనం గా ప్రారంభించిన సాయికృష్ణ మల్టీస్పెషలిటీ హాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించిందని ఆసుపత్రి నిర్వాహలు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 300 కు పైగా పేషెంట్స్ ఉచితంగా బిపి, షుగరు, థైరాయిడ్, నెమ్ము, ఆయాసం, ఉబ్బసం, దీర్ఘ కాలికంగా ఉన్న ఊపిరితిత్తుల సమస్యలు, నరాల సమస్యలు, కీళ్లవాతం, రక్తహీనత, కాళ్ళవాపులు అన్ని జెనరల్ వ్యాధులుకు పరీక్షలు చేసారు. ఈ వైద్య శిబిరంలో యండి జెనరల్ మెడిసిన్ డాక్టర్ సింగరాజు విద్య యండి పల్మనాలజీ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ ఆధ్వర్యంలో బిపి, షుగరు, ఇసిజి, చెస్ట్, థైరాయిడ్, పి.యఫ్.టి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులు మాట్లా డుతూ సత్తెనపల్లి పరిసర గ్రామాల్లో రానున్నరోజుల్లో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయంపై చెప్పండి

ప్రజాశక్తి - మాచర్ల : మాచర్ల పట్టణంలో విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలిగితే ఈ క్రింది తెలిపిన ఫోన్ నంబర్లను సంప్రదించాలని మాచర్ల విద్యుత్ శాఖ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని నెహ్రునగర్, గుంటూరు రోడ్డు, శుద్ధ గుంతల, పిడబ్ల్యూ కాలనీ, బస్టాండ్ ఏరియా, రామా టాకీస్ లైన్, జండా చెట్టు, రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతాల వారు 33/11కెవి శుద్ధ గుంతల సబ్ స్టేషన్ 94910 52201 సంప్రదించాలి. శ్రీశైలం రోడ్డు, షరీన్ కాలనీ, గౌడకాలనీ, కళాకారుల కాలనీ, వెంకటరామిరెడ్డి కాలనీ, కోడెల శివప్రసాద్ కాలనీ, సాగర్‌రోడ్డు, ఎస్‌కెబిఆర్ కాలేజీ, మున్సిపాల్టీ ఆఫీసు ఏరియా, కళామందిర్ ఏరియా, 13వ వార్డు, పార్క్‌సెంటరు, కూరగాయల మార్కెట్, గవర్నమెంట్ హాస్పిటల్ ప్రాంతాల వారు 33/11 కెవి రింగ్‌రోడ్డు సబ్ స్టేషన్ 9490615578, వినాయకునిగుట్ట, ఆజాద్‌నగర్, చెన్నకేశవ స్వామిగుడి, పాతూ రు, బురుజు, రథం బజారు ప్రాంతం వారు 33/11కెవి రైట్ కెనాల్ సబ్ స్టేషన్ 8331095492 సంప్రదించాలని కోరారు.

మహిళా రైతుకు సన్మానం

ప్రజాశక్తి - యడ్లపాడు

ప్రకతి వ్యవసాయం చేస్తున్న దివ్యాంగురాలైన మహిళా రైతును దత్తత తీసుకున్న వినియోగదారులు సన్మానించారు. యడ్లపాడు మండలం ఉన్నవకు చెందిన దివ్యాంగురాలైన మహిళా రైతు పి కోటేశ్వరమ్మ 2018 నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తోంది. అంగ వైకల్యాన్ని అధిగమించి భర్త వెంకటేశ్వరరావుతో కలసి పొలం పనుల్లో సాయపడుతోంది. పత్తి, మిర్చి తదితర ప్రధాన పంటలలో పలు రకాల కూరగాయలు, ఆకుకూరలు అంతర పంటలుగా సాగు చేస్తోంది. ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ సొంతగా తయారు చేసిన జీవామృతం, పంచ గవ్య, వంటి కషాయాలను పంటలకు పిచికారీ చేస్తున్నారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందుల అవశేషాలు లేని ఆమె పంట ఉత్పత్తులపై ప్రజల్లో పేరొచ్చింది. కోటేశ్వరమ్మ పండిం చిన పంటలు తాము కొనుగోలు చేస్తామని ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాలకు చెందిన ఆరోగ్య స్పృహ కలిగిన 19 మంది వినియోగదా రులు గతేడాది ఆమెను కలిశారు. రైతుగా దత్తత తీసుకుంటామని ప్రతిపాదించారు. లాభనష్టాలతో సంబం ధం లేకుండా పండిన పంట దిగుబడిని ఇచ్చేలా ఆమెతో ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నారు. తలా రూ.5 వేలు చొప్పున చెల్లించారు. ఒప్పందంలో భాగంగా వినియోగ దారులు ఆదివారం కోటేశరమ్మ ఇంటిని సందర్శించారు. కంది పప్పు, కారం, ఉల్లిపాయలు, శనగ పంట ఉత్పత్తులను కోటేశ్వరమ్మ వినియోగదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వినియోగ దారు లు కోటేశరమ్మను పుష్పగుచ్చాలు అందించి శాలు వాలు కప్పి ఘనంగా సన్మానించారు. ధన్యావాదాలు తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రకతి వ్యవసాయం చేస్తున్న ఐదుగురు రైతులు హాజరయ్యారు. భూమి రక్షణ, ఆరోగ్య పరిరక్షణకు ప్రకతి వ్యవసాయం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

కోటేశ్వరమ్మ దంపతులను సన్మానిస్తున్న వినియోగదారులు

తెలుగు రాష్ట్రాల స్థాయిలో 'పాడుతా హాయిగా' పోటీలు

బహుమతి అందుకుంటున్న ఆవుల వెంకట కేధార్ ఆద్య

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి వార్షిక బ్రహోత్సవాల ను పురస్కరించుకొని తెలుగు రాష్ట్రాల స్థాయిలో జరిగిన పాటలు పోటా పోటీగా సాగాయి. లయన్స్ క్లబ్ మాచర్ల పల్నాడు ఆధ్వర్యంలో చుండూరి వెంకటేశ్వర్లు నిర్వహణ లో స్థానిక మానుకొండ కల్యాణ మండపంలో జరిగిన 'పాడుతా హాయిగా' పాటల పోటీలకు ముఖ్యఅతిధిగా మున్సి పల్ చైర్మన్ పోలూరి నరసింహారావు హాజరై పోటీ లను ప్రారంభిచారు. ఆయన మాట్లా డుతూ లయన్స్ క్లబ్ పల్నాడు సేవా కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయటం అభినందనీయ మన్నారు. సంగీతం మనసును ఆహ్లాద పరుస్తుందని, ఉల్లాసాన్ని కల్గిస్తుందని తెలిపారు. పాటల పోటీల న్యాయనిర్ణయితలుగా విశ్వేశ్వరరావు, రవివర్మ వ్యవహరిం చగా, కె.సాయిమార్కొండారెడ్డి, పివి. నరసరాజు వాఖ్యాత లుగా వ్యవహరించారు. పోటీలలో 40 మంది పాల్గొనగా, 22 మంది ఫైనల్‌కు చేరుకున్నారు. మొదటి స్థానాన్ని మాధవి, రెండవ స్థానంలో హనుమంత రావు, మూడవ స్థానంలో శివబాబు, నాల్గొవ స్థానంలో రామారావు, ఐదవ స్థానంలో డి. చిన్నా నిలిచారు. రంగస్థల కళాకారు లు నాసరయ్య ను నీలంపాటి శ్రీలక్ష్మీఅమ్మవారి సేవా సంఘం గండపెండారంతో సత్కరించింది ముందుగా లయన్ కెపి చంద్ర శేఖరరెడ్డి దంపతలు జ్యోతి ప్రజ్వలన చేశారు. డాక్టర్ కమలహాసన రావు, ఓరుగంటి చెన్నకేశవ రావు కార్యక్రమానికి సహాయం అందించారు. కార్యక్రమం లో క్లబ్ సెక్రటరీ కె. అంకాప్రకాష్, ఆర్టీసి డీఎం ముత్యాలు నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ బత్తుల ఏడు కొండలు, అల్లం కోటిరెడ్డి, విడేల శ్రీనివాసరావు, చండూరి సత్యానారాయణ, నామేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సరుకులు అందజేస్తున్న న్యాయవాది జి.జె.రావు

పవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

సమాజంలోని పేద ప్రజలను గుర్తించి వారిని ఆదుకోవ డమే పవర్ ఫౌండేషన్ లక్ష్యమని ఆ సంస్థ వ్యవస్థాపకులు న్యాయవాది జి.జె. రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని నెహ్రునగర్‌కు చెందిన వికలాంగుడు షేక్ ఇమాంసాకు రూ.5వేల విలువైన నిత్యవసర సరుకులను జయంతి నగర్ ఫౌండేషన్ ఆశ్రమంలో అందజేశారు. అనంతరం జి.జే రావు మాట్లాడుతూ పవర్ ఫౌండేషన్ పేరిట ఐదు సంవత్సరాల నుండి మాచర్ల మరియు పరిధిలోని పలు గ్రామాల ప్రజలకు ఎన్నో సేవలను అందించారు. పవర్ ఫౌండేషన్ తరపున సేవల ను మరింత విస్తరించేందుకు దాతలు సహకరిం చాలని ఆయన కోరారు. ఈ క్రమంలోనే ఇమాంసాకు బియ్యం, కిరాణా సరుకు లను ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ అధ్యక్షులు పి.మునయ్య, కన్వీనర్ వై సాంబశివ రావు, జి రాజు పాల్గొన్నారు.

జ్ఞాపకశక్తిలో హరిహిణికి అవార్డు

ప్రజాశక్తి - రెంటచింతల

జ్ఞాపకశక్తిలో అపార మేదస్సు కనబరిచిన శ్యామల హరిహిణి ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి చేతులు మీదుగా అవా ర్డును అందుకుంది. రెంటచింతలకు చెందిన ఈ పాప గుంటూరు లోని మౌనిక శ్రీ అకాడమీలో యూకేజీ చదువుతుంది గణితంలో సిద్ధాంతాలను కనిపెట్టిన 45 మంది మేధావుల పేర్లను ఒక నిమిషం 19 సెకండ్ లో చెప్పి రికార్డు సాధించింది. ఛాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సంస్థను చిన్నారి ప్రతిభను గుర్తించి అవార్డులను ప్రకటించారు వాటిని ఎంపీ అయోధ్య రామిరెడ్డి చేతుల మీదుగా చిన్నారి శ్యామల హరిహిణికి అందించారు. ఈ చిన్నారి జ్ఞాపకశక్తికి సంబంధించి ప్రత్యేక శిక్షణ కూడా తీసు కుంటుంది శ్యామల రవికిషోర్‌రెడ్డి సావిత్రిని ఎంపీ ప్రత్యేకంగా అభినం దించారు. ఈ కార్యక్రమంలో మౌనిక శ్రీ డైరెక్టర్ రామారావు మెమొరీ ట్రైనర్ నాగస్వప్న పాల్గొన్నారు.

అవార్డు నందుకుంటున్న హరిహిణి

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు

ఊరేగింపుగా వెళ్తున్న క్రైస్తవులు

ప్రజాశక్తి - క్రోసూరు

క్రోసురు మండల కేంద్రంలోని లూథరన్ చర్చి అధ్వ ర్యంలో మట్టల ఆదివారం ఘనంగా జరిగింది. సండే స్కూల్ విద్యార్థులు, యవనస్తులు ఈత మట్ట లు చేతపట్టుకొని గ్రామ ప్రధాన వీధులలో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమం లో స్థానిక సంఘ కాపరి రెవ. డా.యం. సుందరరావు అధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో పాస్టర్ మాట్లా డుతూ యేసు క్రీస్తు సిలువ మరణానికి అప్పగించటానికి ముందు యెరూషలేము పట్టణము లోకి వెళ్ళినప్పుడు అక్కడ ప్రజలు యేసును ఒక రాజుగా బావించి ఊరేగింపుగా ఈత మట్టలు, కర్జుర మట్టలు, పట్టుకొని యేసుకు జయం జయం అని కేకలు వేయుచు యెరూషలేములోకి ఆహ్వానించారని తెలిపారు. ప్రేమ, జాలి, దయ గుణములతో ప్రజల పాప ముల కొరకు శిలువ మరణం పొందారని తెలిపారు. కార్య క్రమంలో సండే స్కూల్ విద్యార్థులు, యవ్వనస్తులు, సండే స్కూల్ టీచర్స్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

సందేశాన్ని వినిపిస్తున్న బిషప్ రైట్.రెవ. చాట్ల ఐజయ్య

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్లలో క్రైస్తవులు మట్టల ఆదివారంను ఘనంగా నిర్వహించారు. వెస్టు గుంటూరు సినాడ్ బిషప్ రైట్.రెవ. చాట్ల ఐజయ్య, పాస్టర్ షడ్రక్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఈత మండలను చేతబూని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిం చారు. దావీదు కుమారునికి జయము, యూదుల రాజుకు జయము అంటూ నినాదాలు చేస్తూ పట్టణంలోని ప్రధాన కూడిలిలో సర్వమానవ క్షేమం కోరుతూ ప్రార్థన నిర్వహిం చారు. సంఘ పెద్దలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

మట్టలు పట్టుకుని ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

దావీదు కుమారునికి జయము.. తండ్రికుమారునికి జయమ.. జయము అంటూ చిన్నారుల కేరిం తలతో పట్టణ వీధులు మార్మోగా యి. మట్టల ఆదివారం పండుగ సం ద ర్భంగా పట్టణంలో సాంబశివనగర్ లోని సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించా రు. చర్చి పాస్టర్ డాక్టర్ కేవీ వసురా జు మాట్లాడుతూ యెరుషలేము ప ట్టణానికి వచ్చిన ఏసుక్రీస్తును అక్క డి ప్రజల్ని జయజయ ధ్వనులతో సంతోష కేరింతలతో గాడిదపై ఊరే గించడం జరిగిందన్నారు. వనిఎ మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వ హించు కుంటున్నట్లు వివరించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థన లు చేసి వాక్య పరిచర్యను గావించారు. కార్యక్రమంలో పాస్టర్ ఎస్ అనిల్‌కుమార్, అజరయ్య, రత్నరా జు, ప్రతాప్, రాజేష్, జోషి, ప్రసన్న, నాని, జాషువా డానియేట్, మంత్రు నాయక్, అంజయ్య పాల్గొన్నారు.

పొన్నూరులో డొక్కా సీతమ్మ జనసేన చలివేంద్రం

ప్రజాశక్తి - చేబ్రోలు

పొన్నూరు పట్టణంలోని 18వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎదురు డొక్కా సీతమ్మ జనసేన చలివేంద్రాన్ని శాసనసభ్యులు, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం పొన్నూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త వడ్రాణం మార్కండేయబాబుతో కలిసి అనారోగ్య సమస్యతో బాధపడుతున్న 6 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, 1000 లీటర్ల మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - కొల్లిపర

మండలంలోని వల్లభాపురం గ్రామంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో సుమారు 48 ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థినీ, విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. 1976-77 సంవత్సరంలో పది పూర్తిచేసుకున్న విద్యార్థులంతా కలుసుకుని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. అలనాటి మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. నాటి గురువులు బోధించిన విధానాలను తలచుకున్నారు. ఆత్మీయ కలయికలో సుమారు 32 మందికి పైగా పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. సభాధ్యక్షులు పూర్వ విద్యార్థి అన్నపురెడ్డి కోటిరెడ్డి మాట్లాడుతూ జీవితంలో అభివృద్ధి చెందాలంటే నిత్యవిద్యార్థిగా పాఠాలను నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో అచ్యుత సాంబశివరావు, డాక్టర్ భీమవరపు రామకృష్ణారెడ్డి, కలకోటి శ్రీనివాస్ రెడ్డి, వంగా శేషిరెడ్డి, భీమిరెడ్డి శేషిరెడ్డి, లంకిరెడ్డి సత్యవతి, నున్నా సుజాత, మేదరమెట్ల అంజన, మురళి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల ప్రతిభను వెలికి తీయాలి

ప్రజాశక్తి - మేడికొండూరు

మేడికొండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల సమగ్ర సమృద్ధి వికాసంపై దివ్యాంగ బాలలు, వారి తల్లి దండ్రులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి సాల్మన్ పాల్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ దివ్యాంగ బాలలు ఎవరి కన్నా తక్కువ కాదని, వారికి చదువులో సరైన మార్గంలో శిక్షణ ఇస్తే అనేక ఉన్నత పదవులు సాధిస్తారని, కావున తల్లిదండ్రులు వారిని అధిక ప్రేమతో ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలని అన్నారు. ల్యాంప్ సంస్థ కోఆర్డినేటర్ షేక్ బాజీ, రిసోర్స్ పర్సన్ టి.మంగయ్య, శిక్షకురాలు సరళాదేవి మాట్లాడారు. ఈకార్యక్రమంలో ఫిరంగిపురం, మేడికొండూరు మండలాలలోని గ్రామాలనుండి దివ్యాంగ బాలలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓబీసీల ఆత్మబంధువు బీపీ మండల్ : కేసన

ప్రజాశక్తి - మంగళగిరి

పలుమార్లు శాసనసభ్యునిగా, పార్లమెంటు సభ్యునిగా, గొప్ప సంఘసంస్కర్తగా, 2వ జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ ఛైర్మన్‌గా, ఓబీసీల అభ్యున్నతి కోసం 27 శాతం విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లతో పాటు,తన నివేదికలో 40 కి పైగా సిఫారసులను ప్రతిపాదించిన ఓబీసీల ఆత్మబంధువు బీపీ మండల్ అని ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కొనియాడారు. ఆదివారం బీ.పీ.మండల్ వర్ధంతి సందర్భంగా స్థానిక మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో పలువురు బీసీ నాయకులు మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ బీపీ మండల్ బీహార్ లోని బెనారస్ లోఅత్యంత భూస్వామ్య జమీందారీ యాదవ కుటుంబంలో 1918 ఆగస్టు 25న జన్మించారన్నారు. చిన్నతనం నుండి అత్యంత తెలివైన మండల్ ఉన్నత విద్యలను అభ్యసించడంతో తన 23వ యేట జిల్లా కౌన్సిల్ కు ఎన్నిక కావడం, 1945 - 51 మధ్య, జీతం తీసుకోకుండా

బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

జ్యూడిషియల్ మెజిస్ట్రేట్గా పనిచేశారన్నారు. 1952 లోనే బీహార్ అసెంబ్లీకి శాసనసభ్యునిగా ఎన్నికై, అధికార పక్షంలో ఉండి కూడా తన బలహీన వర్గాలకు చెందిన కుర్మీలపై, అగ్రవర్ణ రాజపుత్రులు దాడి చేయడాన్ని నిరసించాడు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కే క్రాంతి కుమార్, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, నియోజకవర్గ అధ్యక్షులు ఉడత శ్రీనివాస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు తిరివీధుల కిరణ్ జిల్లా నాయకులు జగ్గనం వరప్రసాద్ ఎనుముల నరసింహారావు ఇసునూరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

20న రాష్ట్ర స్థాయి టైలర్ల అసోసియేషన్ ప్రతినిధుల సదస్సు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి మసీదు వీధిలోని ఆక్సుర్డ్ టైలర్స్ ఆవరణలో ఆదివారం అమరావతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షులు షేక్ నాగుల మీరా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ టైలర్స్ ఫెడరేషన్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర టైలర్స్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకాశపు స్వామి హాజరయ్యారు. సమావేశాన్ని ఉద్దేశించి స్వామి మాట్లాడారు. టైలర్స్ అందరూ ఐకమత్యంతో ఉంటేనే ఏదైనా సాధించగలుగుతామన్నారు. మంగళగిరిలో బిస్మిల్లా వారి సామాజిక భవనంలో ఈనెల 20వ తేదీన రాష్ట్రస్థాయిలో రాష్ట్రంలోని అన్ని టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధుల సదస్సు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో

అమరావతి టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో ప్రతినిధులు

అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జంజనం వెంకట సాంబశివరావు, అసోసియేషన్ ప్రతినిధులు నల్లమోలు సుబ్రహ్మణ్యం, షేక్ రజాక్, చాదరాజుపల్లి భాస్కర్, మర్రి శివ బ్రహ్మం, బాపనపల్లి అంజయ్య, పటాన్ నాగూర్ ఖాన్, తిరువీధుల భవన్నారాయణ, సాంబశివరావు, సయ్యద్ యునూష్, నూతన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - గుంటూరు

అన్ని అవయవాల కంటే ముఖ్యమైన నేత్రాల సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ శ్రావణలక్ష్మి అన్నారు. అవగాహన సంస్థ ఆధ్వర్యంలో అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో నేత్ర సమస్యలపై ఆదివారం ఆరోగ్య సభ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రావణలక్ష్మి మాట్లాడుతూ కళ్ళ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వల్ల చూపు కోల్పోయినా, మందగించినా మన రోజువారి కార్యకలాపాలకు ఇతరులపై ఆధారపడాల్సి వస్తుందన్నారు. పెద్దలలో తరచూగా ఉండే సమస్యల్లో నీటి కాసులు మరొకటని తెలిపారు. మన శరీరంలో బ్లడ్‌ప్రెషర్ ఉన్నట్లుగా కంటిలో కూడా ప్రెషర్ ఉంటుందని అది ఎక్కువైన సందర్భాల్లో నీటి కాసుల సమస్య ఉత్పన్నం అవుతుందన్నారు. ఇటీవల కాలంలో పిల్లలలో, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో పొడి కంటి సమస్యలు ఎక్కువగా చూస్తున్నామని, వారు ఎక్కువసేపు కళ్ళు ఆర్పకుండా అదేపనిగా చూడటం వల్ల అలాంటి సమస్యలు వస్తున్నాయన్నారు. కావున ప్రతి 20 నిమిషాలకు ఒకసారి, కనీసం ఒక 20 సార్లు కళ్ళు మూసి తెరవటం అనేది చేస్తూ ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని సూచించారు. అనంతరం డాక్టర్ శ్రావణలక్ష్మిని అవగాహన సభ్యులు సత్కరించారు. సభలో టీ.వీ. సాయిరాం, వాణిజ్యవేత్త బాదం బసవగుప్త, విశ్రాంత అధికారి వి.సత్యనారాయణ ప్రసంగించారు.

మాట్లాడుతున్న డాక్టర్ శ్రావణలక్ష్మి

ఘనంగా మట్టల ఆదివారం

ప్రజాశక్తి - చేబ్రోలు

గుడ్ ఫ్రైడేకి ముందు వచ్చే ఆదివారం క్రైస్తవ విశ్వాసులు మట్టల ఆదివారం గా పవిత్రంగా నిర్వహించుకుంటారు . సందర్భముగా మండలంలోని కొత్త రెడ్డిపాలెం సండే స్కూల్ టీచర్ మురికిపూడి బుజ్జిబాబు మాట్లాడుతూ ఏసుక్రీస్తు తన జీవిత కాలంలో మూడు సంవత్సరాలు ప్రకటించారని అన్నారు. సత్య సువార్తను గుర్తించని వారు తనను చంపుతారని తెలిసి కూడా వారు దేవుని కోపానికి గురై శిక్షించబడతారని వారి విషయంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్న సందర్భంలో యేసు ఏడ్చాడు అని చెప్పారు. సండే స్కూలు విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

గుడ్ ఫ్రైడే కు ముందు వచ్చే ఆదివారం ను ప్రపంచ వ్యాప్తంగా క్రైస్తవులు "మట్టల ఆదివారం" గా ఆచరిస్తారు. క్రీస్తు తన శిలువ మరణానికి ముందు జెరూసలేం నగరంకు వచ్చినపుడు ఆనాటి ప్రజలు ఆయనకు ఖర్జూర మట్టలతో స్వాగతం పలుకుతారు.. పిల్లలూ పెద్దలూ కూడా ఉత్సాహంగా ఈ స్వాగత కార్యక్రమంలో పాల్గొంటారు. ఆనాటి ఆ ఘటనను గుర్తుకు తెచ్చుకుంటూ క్రైస్తవులు ఈ "పామ్ సండే" ను ఆచరిస్తారు. కార్యక్రమంలో సండే స్కూల్ టీచర్స్ ధనలక్ష్మి, ఉమా మహేశ్వరి, గీతిక, చిలక ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

పట్టణ, రూరల్ గ్రామాల్లో ఆదివారం మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. వివిధ క్రైస్తవ దేవాలయాలలో ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సండే స్కూల్ చిన్నారులతో మట్టలను పూలతో అలంకరించి, ర్యాలీ నిర్వహించారు. దైవ సేవకులు మట్టలాదివారం విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆయా సంఘ కాపరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలి పట్టణంలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు పునరుద్ధాన పండుగ ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని, క్రీస్తు అనుభవించిన శ్రమలదినాలకు ఈ క్రమంలో స్థానిక హయ్యర్ పేట లూథరన్ దేవాలయం సంగస్తులంతా పట్టణ పురవీధుల్లో తిరుగుతూ క్రీస్తు పాటలకు నఅత్యాలు చేశారు. కోలాటం ప్రదర్శనలు చేసి చూపరులను ఆకట్టుకున్నారు.

అంబేద్కర్ జయంతి సందర్భంగా పార్క్ రోడ్‌లో వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - మంగళగిరి

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా మంగళగిరి పార్క్ రోడ్ యూత్ ఆధ్వర్యంలో ఆదివారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీలను పగిడి ప్రభుదాసు ప్రారంభించి మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ఆయన యొక్క జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి అన్నారు. ఈ పోటీల్లో నాలుగు టీములు పాల్గొన్నారు.. ఈ కార్యక్రమంలో పార్క్ రోడ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు. విజేతలకు సోమవారం బహుమతులు అందజేస్తారు.

అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మైనారిటీ చైర్మన్‌ను కలిసిన షేక్ సలీం

ప్రజాశక్తి - మంగళగిరి

విజయవాడలో ఆదివారం సిద్దార్థ కాలేజ్ ఆడిటోరియంలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా శంఖారావం జరిగింది. ఏఐసీసీ మైనారిటీ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్ ఘడి ని మర్యాదపూర్వకంగా మంగళగిరి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి షేక్ సలీం కలిశారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న మైనారిటీలలో ఇటీవల ఎన్డీయే ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బిల్ తో తీవ్ర అలజడి సఅష్టించిందని దుయ్యబట్టారు. ఈ బిల్ లో అనేక అవకతవకలు ఉన్నాయని ఈ బిల్ ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ ఎంపీగా ఉన్న ప్రస్తుత ఏఐసీసీ మైనారిటీ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్ను తనవంతు కఅషిచేసి ఈ బిల్ రద్దుకు తోడ్పాటు అందించాలని కోరారు.

హిందీలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి సికె జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన డాక్టర్. వై. లలిత కుమారి జివిఆర్ హిందీ సేవ పురస్కార సన్మాన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అనేక హిందీ సంబంధిత పోటీలలో కేకే మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అనేక బహుమతులు పొంది సన్మానాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దరియావలి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రముఖ వ్యాపారవేత్త కరణం ధర్మారావు మృతి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కరణం ధర్మారావు(80) ఆదివారం మృతి చెందారు. రూరల్ గ్రామం కఠెవరంలో ఉంటున్న ఆయన వయో భారంతో మృతి చెందారు. వ్యాపారవేత్తగా ఆయన పట్టణ ప్రజలకు సుపరిచితులు. తనయుడు కరణం వెంకటేశ్వరరావు కేబుల్ సంస్థ స్థాపనకు, వ్యాపారాభివృద్ధికి ఆయన వెన్నంటి ప్రోత్సహించారు. ధర్మారావు అంతిమయాత్ర సోమవారం ఉదయం కఠెవరం గ్రామంలోని స్వగృహం నుండి ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. ధర్మారావు భౌతికాయాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు, గ్రామస్తులు సందర్శించి నివాళులర్పించారు.

రాయితీపై సోలార్ రూఫ్‌టాప్

- ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు
- విద్యుత్ సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ 1912
- ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు రూ.34 కోట్లు
- ఇపిడిసిఎల్ ఎస్ఇ పి.విజయ్ కుమార్

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ నిరంతరం సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ (సిపిడిసిఎల్) పల్నాడు జిల్లా ఎస్.ఇ పి.విజయ్ కుమార్ చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి అదనపు ఛార్జీల భారం నుండి బయట పడాలన్నారు. విద్యుత్ చౌర్యం నేరమన్నారు. విద్యుత్ అవసరాలు రోజురోజుకు పెరుగుతున్నాయని, వేసవిలో విద్యుత్ వాడకం ఏటా పెరుగుతుండడంతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అవసరమైనన్ని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎక్కడైనా పెద్ద సమస్య తలెత్తినా 2 గంటల వ్యవధిలో మరమ్మతులు చేపట్టి విద్యుత్ పునరుద్ధరిండానికి అవసరమైన యంత్రాంగం అందుబాటులో ఉందని అన్నారు. విద్యుత్ వినియోగదారులు వేసవిని దఅష్టిలో ఉంచుకుని విద్యుత్ వఅథా చేయరాదన్నారు. ప్రమాదాల భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు?

ఓల్టేజ్ సమస్యలపై ఏమైనా ఫిర్యాదులు అందితే తక్షణమే ట్రాన్స్ఫార్మర్ మార్చేసి సమస్యను పరిష్కరిస్తున్నాం. ఏ గ్రామంలో నైనా అటువంటి సమస్య ఉంటే తమ సిబ్బంది ద్వారా సమస్య పరిష్కారం చేసుకోవచ్చు.లేదా 1912 కు ఫిర్యాదు చేయొచ్చు.

విద్యుత్ చౌర్యం అరికట్టేందుకు చేస్తున్న ప్రయత్నాలు?

తరచూ విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. జిల్లాకు సంబంధించిన విద్యుత్ శాఖ సిబ్బంది సైతం ప్రతినెలా ఒక మండలంలో పర్యటిస్తూ విద్యుత్ చౌర్యంపై జరిమానాలు వేస్తున్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకుంటే 24 గంటలలో మంజూరు చేస్తున్నాం.

విద్యుత్తు స్తంభాల మార్పులు?

శిథిలావస్థకు చేరిన స్తంభాలు ఉన్నట్లు సిబ్బంది దృష్టికి తెచ్చినా, ఫిర్యాదులు వచ్చినా అటువంటి ప్రాంతాల్లో వాటిని తొలగించి కొత్తవి ఏర్పాటు చేస్తున్నాం. ఇటీవల కాలంలో గత ఏడాది 10 వేల కొత్త స్తంభాలు ఏర్పాటు చేశాం. లూజుగా ఉన్న వైర్లు సరిచేశాం.

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరులో అవినీతి ఆరోపణలకు మీ సమాధానం?

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం ఒక ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు కనీసం 4 గురు రైతులు దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో రైతు రూ 6225 డిడి రూపంలో ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో రైతుకు 3 స్తంభాలు దానికి సరిపడా విద్యుత్ తీగ అందిస్తాం. దరఖాస్తు చేసుకుంటే నెల రోజుల్లోగా కనెక్షన్లు ఇస్తాం. ఇప్పటికే కనెక్షన్లు ఉన్న ప్రాంతంలో అయితే దరఖాస్తు చేసుకున్న ఒకటి రెండ్రోజుల్లో కనెక్షన్ మంజూరు చేస్తాం. అదనంగా సిబ్బంది డబ్బు డిమాండ్ చేస్తే చర్యలు తీసుకుంటాం. ఎవరికి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు.

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి?

పల్నాడు జిల్లాలో 88934 కనెక్షన్ల వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. రోజుకు 9 గంటల నిర్దేశించిన సమయానికి సరఫరా ఇస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో రూ 95.05 కోట్లతో 5003 నూతన వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేశాం. ఈ ఏడాది జూన్ వరకు రూ 17.16 కోట్లతో 903 కనెక్షన్లు మంజూరు చేశాం. నూతనంగా 1600 కనెక్షన్లు మంజూరు చేశాం. 2200 పెండింగ్ లో ఉన్నాయి.

ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న రాయితీలు?

ఎస్సీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం మినహా ఎటువంటి రాయితీలు లేవు. పల్నాడు జిల్లాలో 67211 ఎస్.సి కుటుంబాలకు, 22225 ఎస్.టి కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వారికి 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ పథకం కొనసాగుతుంది. 200 యూనిట్ల కంటే వినియోగం పెరిగితే మొత్తం బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. కొంత మంది అవగాహన లేక మొత్తం ఉచితం అనుకుని బిల్లులు చెల్లించడం లేదు. 200 యూనిట్లు దాటి 1 యూనిట్ వినియోగించుకున్నా మొత్తం యూనిట్లకు బిల్లు చెల్లించాల్సిందే. 2023 ఏప్రిల్ నుండి గత ఏడాది జూన్ వరకు 49.21 కోట్ల విద్యుత్ బకాయిలున్నాయి.

గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా లేదని విమర్శలున్నాయి కదా?

మారుమూల గ్రామాల ప్రజలకు ఎటువంటి అంతరాయమూ లేకుండా చూస్తున్నాం. 5 వేలు జనాభా దాటిన 24 గ్రామాలకు అటవీ పరిసర గ్రామాలైన బల్లాపల్లి, మాచర్ల మండలాలలో 47, గురజాల నియోజకవర్గంలో 25, వినుకొండ మండలంలో 8 గ్రామాలకు 3 ఫేజ్ విద్యుత్ 24 గంటలు సరఫరా ఇస్తున్నాం.

పధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం గురించి?

ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద రాయితీపై సోలార్ విద్యుత్ కనెక్షన్లు అందిస్తున్నాం. సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులను తగ్గించుకోవచ్చు. ఈ పథకం వలన గఅహ వినియోగదారులకు అతి తక్కువ విద్యుత్ బిల్లు వస్తుంది. ఇంటి కప్పుపై కనీసం 10 చ.మీటర్లు లేదా 100 చ.అడుగుల స్థలం లో ఒక కిలోవాట్ సామర్థం కలిగిన్ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. సోలార్ రూఫ్ టాప్ ప్లాంట్ కెపాసిటీ 1 నుంచి 2 కిలో వాట్స్, 2 నుంచి 3 కిలో వాట్స్, మూడు కిలో వాట్స్ పైన ఉండే కెపాసిటీలలో సోలార్ రూఫ్ టాప్ లను ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందుకు రూ 30 వేల నుంచి రూ 78 వేల వరకు పథకం ద్వారా ప్రభుత్వం నుంచి సబ్సిడీ పొందవచ్చు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఇంటర్ ఫలితాల్లో గురవయ్య కాలేజి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- గుంటూరు

స్థానిక బ్రాడీపేటలోని మాజేటి గురవయ్య జూనియర్ కాలేజి విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాధవపెద్ది విజయలక్ష్మి అన్నారు. ఆయా విద్యార్థులను ఆదివారం కళాశాలలో అభినందించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ జూనియర్, సీనియర్ ఇంటర్‌లో 130 మంది ఎంపీసీ గ్రూప్‌నకు పరీక్షలు రాయగా 71 శాతం మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో పాల్‌రియాన్ 862, వరుణ్‌సాయి 836 మార్కులు సాధించారన్నారు. 90శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం సీఈసీలో శ్రీరామ్‌నాయక్ కామర్స్‌లో 98, సివిక్స్‌లో 95 శ్రీరామ్ నాయక్ సాధించడంతోపాటు తెలుగులో 99 మార్కులుతో నలుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో తేజస్విని, సీఈసీలో మోహన్‌కృష్ణ అత్యధిక మార్కులు సాధించారన్నారు.ఆయా విద్యార్లుకు కళాశాల కార్యదర్శి మాజేటి వెంకట రామకోటి ముత్యాలు, అధ్యక్షులు గుడివాడ రూపచంద్రరావు కఅతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-గుంటూరు

ఇంటర్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని విద్యా సంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. జూనియర్ ఎంఈసిలో 500 మార్కులకుగాను మల్లవోలు లిఖిత 494, ఓ.కె.గీతిక 494 మార్కులు, మామిడిపాక హరిణి 494 మార్కులు సాధించారని తెలిపారు. 490 ఆపైన మార్కులు 88 మంది, 480 ఆపైన 498 మంది, 475 ఆపైన 649 మంది సాధించారన్నారు. అదే విధంగా సీనియర్ ఇంటర్‌లో ఎస్.సాత్విక 982 మార్కులు సాధించినట్లు తెలిపారు. 970 ఆపైన మార్కులు 71 మంది, 960 ఆపైన మార్కులు 141 మంది సాధించారన్నారు. ఈ సందర్భంగా ఆయా విద్యార్థులను అభినందించారు.

నేడు గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి- గుంటూరు

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా నేడు నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగదని జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని ఆ ప్రకటనలో జిల్లా రెవెన్యూ అధికారి కోరారు.

అంబేద్కర్ జయంతి సందర్భంగా గుంటూరు నగరపాలక సంస్థలో నేడు నిర్వహించాల్సిన గ్రీవెన్స్, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలు రద్దు చేసినట్లు నగర కమిసనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కావున నగర ప్రజలు సహకరించాలని, స్థానిక సమస్యల పరిష్కారం కోసం జిఎంసి కాల్ సెంటర్ 0863-2345103 పిర్యాదు చేయవచ్చునన్నారు.

కిమ్స్‌శిఖరలో క్లిష్టమైన శస్త్ర చికిత్స విజయవంతం

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరులోని కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో సంక్లిష్టమైన మెదడు శస్త్ర చికిత్సను డాక్టర్ సూరప్రదీప్ కుమార్‌రెడ్డి, డాక్టర్ చిట్యం లక్ష్మణ్ విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యులు చికిత్స వివరాలను ఆదివారం వెల్లడించారు. 50 యేళ్ల మహిళ తరచుగా ఫిట్స్‌తో బాధపడుతూ పలు హాస్పిటల్స్ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయింది. గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్స్‌లో డాక్టర్ సుర ప్రదీప్‌కుమార్‌రెడ్డిని సంప్రదిం చింది. అది మెనింగియోమాటోసిస్ అనే అరుదైన వ్యాధిగా డాక్టర్ గుర్తించారు. ఈవ్యాధితో బాధపడుతున్న వారికి ఆపరేషన్‌చేసి తీసివేస్తే పూర్తిగా కోలుకుంటారని కానీ మెదడులో నాలుగు చోట్ల ట్యూమర్లు ఉండంతో ఆపరేషన్ క్రిటికల్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. న్యూరో సర్జన్ డాక్టర్ లక్ష్మణ్‌రావు పరీక్షలు చేసి ఇది క్యాన్సర్ గడ్డ కాదని నిర్ధారించి నయం చేయడానికి అవకాశం ఉందని తెలుసుకున్నారు. ఒక ఛాలెంజింగ్ కేసుగా తీసుకొని ఆపరేషన్ దశలలో 7 గంటలపాటు శ్రమించి, డాక్టర్ చిట్టెం లక్ష్మణ్‌రావు మొత్తం 4 క్లిష్టమైన గడ్డలు తీసివేశారు. మొత్తంగా సుమారు 500 గ్రాముల బరువున్న నాలుగు గడ్డలు విజయవంతంగా తొలగించారు. అత్యాధునిక వైద్య పద్ధతులైన న్యూరో నావిగేషన్, 25 టైమ్స్ మల్టిపుల్ చేసే మైక్రోస్కోప్, క్యూసా న్యూరోడ్రిల్, ఇంట్రా ఆపరేటివ్ మానిటరింగ్ వంటి అధునాతన వైద్యవిధానాలు, అత్యాధునిక వైద్య పరికరాలతో ఆపరేషన్ విజయవంతంగా చేసినట్లు చెప్పారు. పేషెంట్ పూర్తిగా కోలుకొని డిస్చార్జ్ చేశామన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ లక్ష్మణ్

శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ పెరగాలి : కమిషనర్

ప్రజాశక్తి- గుంటూరు

గుంటూరు నగరంలో మెరుగైన పారిశుధ్యం కోసం శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు నిర్దేశిత సమయంలో విధులకు హాజరై పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ ఆదివారం ఏటి అగ్రహారం, చుట్టుగుంట, కెవిపి కాలనీ, లాల్‌పురం రోడ్డు, అరండల్‌పేట, శంకర్‌విలాస్ ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్యంపై క్షేత్ర స్థాయి నుండి అనేక ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులు ఉదయం మస్టర్‌కి సకాలంలో హాజరు కావాలన్నారు. కార్మికులు తప్పనిసరిగా ఉదయం మెయిన్ రోడ్ల స్వీపింగ్ పూర్తి అయ్యాక, ఇంటింటి చెత్త సేకరణ చేయాలన్నారు. మధ్యాహ్నం గ్యాంగ్‌వర్క్ ద్వారా సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రైన్లు, పరిసరాలు శుభ్రం చేయాలన్నారు. రోడ్డు మార్జిన్లలో గార్బేజ్ నిల్వలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు.

మందులు అందచేస్తున్న డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు, వైద్యులు

వెంకటేశ్వర హాస్పిటల్‌లో ఆయుర్వేద శిబిరం

ప్రజాశక్తి- గుంటూరు

గోరంట్లలోని శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్‌లో ఆదివారం ప్రముఖ కేరళ ఆయుర్వేదిక్ వైద్యనిపుణులు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు, ఇతర వైద్యబృందంచే ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్ మాట్లాడుతూ ఆయుర్వేదం మనదేశ వైద్యవిధానం అని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్లు ఉండవన్నారు. అన్ని వయస్సుల వారికీ చికిత్స తీసుకోవచ్చన్నారు. ఇఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఈదా సాంబిరెడ్డి మాట్లాడుతూ గుంటూరులో వందపడకలతో తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదైన ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఉండటం గర్వకారణం అన్నారు. కేరళ వెళ్లాల్సిన అవసరం లేకుండానే గుంటూరులోనే ఆయుర్వేద వైద్యసేవలు వినియోగించుకోవాలన్నారు. యోగా గురువు భైసు మల్లిఖార్జునరావు మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉండటానికి కావాల్సిన సంపూర్ణ వైద్య విధానం ఆయుర్వేదం అని చెప్పారు. ఈ శిబిరంలో కీళ్లనొప్పులు, సయాటికా, స్పాండిలైటిస్, పైల్, సెక్స్ సమస్యలు, స్త్రీ సంబంధిత, నరాలు, నాడీ సంబంధిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ భానుకశ్యప్, డాక్టర్ రాహుల్‌చంద్ర, డాక్టర్ మోనిక, మేనేజర్ మల్లేశ్వరి, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.